**నేటి కందం-నేటికి అందం**

గొప్పగ యూకే తోడుత
నొప్పందము కుదిరినంత నుభయులకు మొగిన్
చిప్పిల్లగ వాణిజ్యము
కుప్పలు తెప్పలుగ భవుడు కూర్చె జయములన్ !!

(భారత్ ఇంగ్లండుల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం వలన రెండు దేశాలకూ లాభం చేకూరుతుంది. భారత్ వ్యవసాయ రంగ ఉత్పత్తులు ఇంగ్లండ్ లోని మార్కెట్ కు కప్పం లేకుండా ప్రవేశిస్తాయి. తద్వారా ఎన్నో వస్తువుల ధరలు తగ్గుతాయి. దాని వలన రెండు దేశాల లోని ప్రజలకు లాభం చేకూరుతుంది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433    E-mail:netinijam93@gmail.com

**చురక**

అధికార యంత్రాంగం
అవినీతిలో సల్లగుండు
పనులకొరకు ఎవరొచ్చిన
ప్రజలంతా బోడగుండు.
దర్యాప్తులు సస్పెండులు
దండిగానే జరుగుతుండు
అయినా ఎట్లా దందలన్నీ
ఆగకుండా పెరుగుతుండు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 17-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:269 పేజీలు:6 వెల: రూ.1/-


## వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తాం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, జులై 16:వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఎల్‌నినోపై రాష్ట్ర తొలి శాస్త్రీయ కంటింజెన్సీ ప్లాన్ విడుదల చేస్తామని తెలిపారు. ఈరోజు సచివాలయంలో ఈ ప్రణాళికను విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఆయా మండలాలు, జిల్లాల వారీగా వర్షపాతం లోటు వివరాలు అందజేయాలని అధికారులకు సూచించారు.

రెండు నెలల వాతావరణ అంచనాల ఆధారంగా కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు. ఐఎండీ సమాచారంతో రోజువారీ వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. రైతులకు పంటల ఎంపిక, నీటి వినియోగంపై శాస్త్రీయ సూచనలు అందజేస్తామని చెప్పారు. ఆయా పంట నష్టాల నివారణకు అన్ని శాఖల సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ఇరాన్‌లో హోర్డింగ్‌పై హెచ్చరిక

న్యూఢిల్లీ, జులై 16: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శవపేటికలో ఉన్నట్టున్న చిత్రాన్ని ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఓ హోర్డింగ్‌పై ప్రదర్శించడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. ట్రంప్‌ను అంతం చేస్తామన్న హెచ్చరికను ఇంగ్లిష్, పర్షియన్ భాషల్లో చిత్రంపై రాశారు.

ఎంఘిలాబ్ స్క్వేర్ ప్రాంతంలోని ఓ హోర్డింగ్‌పై ఈ వార్నింగ్‌ను ప్రదర్శించారు. మినాబ్‌కు చెందిన చిన్నారుల స్మృత్యర్థం అని కూడా చిత్రంపై రాశారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై జరిగిన తొలి దాడిలో మినాబ్ నగరంలోగల ఓ స్కూల్లోని విద్యార్థులు కూడా మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనను ఉద్దేశిస్తూ బిల్‌బోర్డుపై నిరసనకారులు ఈ హెచ్చరిక చేశారు.

ట్రంప్‌ను చంపేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఇజ్రాయెల్ కొద్ది రోజుల క్రితమే యూఎస్‌ను హెచ్చరించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్ నిఘా వర్గాలు అమెరికాను ఈ మేరకు అప్రమత్తం చేసినట్టు తెలుస్తోంది. ట్రంప్‌నకు ముప్పు ఉండవచ్చనే సంకేతాలు అమెరికా నిఘా వర్గాల దృష్టికి కూడా వచ్చినట్టు సీఎన్ఎన్ వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. అయితే, ట్రంప్‌ను అంతం చేసేందుకు ప్రత్యేకంగా కుట్ర జరుగుతోందని ఇజ్రాయెల్ హెచ్చరించడం ఇదే తొలిసారని అమెరికా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ కథనాలు వైరల్ అయిన కొద్ది సేపటికే ట్రంప్ ఇరాన్‌కు గట్టి వార్నింగ్ కూడా ఇచ్చారు. ఇరాన్ వైపు 1000 మిసైల్స్‌ను గురిపెట్టి ఉంచామని అన్నారు. తనను టార్గెట్ చేస్తే మరిన్ని మిసైల్స్ ఇరాన్ వైపు దూసుకొస్తాయని హెచ్చరించారు.

## ప్రమాదాల నియంత్రణకు బ్లాక్‌స్పాట్లపై ఎస్పీ ప్రత్యేక దృష్టి




రాజన్న సిరిసిల్ల, జులై 16:(నేటినిజం ప్రతినిధి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే బోయినపల్లి మండలం కోదురుపాక చౌరస్తాలోని ప్రమాదకర బ్లాక్‌స్పాట్‌ను గురువారం పరిశీలించారు.

ప్రమాదాలకు దారితీసే కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్ట్రీట్‌లైట్లు తదితర భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.

అనంతరం మిడ్ మానేర్ డ్యామ్‌ను సందర్శించిన ఎస్పీ, డ్యామ్ భద్రతా ఏర్పాట్లు, ముందస్తు జాగ్రత్తలపై ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.

వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## న్యూజిలాండ్‌లో మరోసారి భూప్రకంపనలు..

### సునామీ హెచ్చరికలు జారీ..

న్యూఢిల్లీ, జులై 16: న్యూజిలాండ్‌లో మరోసారి భూప్రకంపనలు భయాందోళనలు రేకెత్తించాయి. దక్షిణ ద్వీపంలోని టె అనౌ పట్టణ సమీపంలో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. టె అనౌకు ఉత్తరాన సుమారు 40 కిలోమీటర్ల(24.85 మైళ్ల) దూరంలో భూకంప కేంద్రం ఉందని న్యూజిలాండ్ జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తెలిపింది.

మరోవైపు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్), జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ (జీఎఫ్‌జెడ్) ఈ భూకంప తీవ్రతను 5.9గా వెల్లడించాయి. భూమికి 50 కిలోమీటర్లకు పైగా లోతులో భూకంపం సంభవించినట్లు నిర్ధారించాయి. కాగా, ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. అయితే, సునామీ హెచ్చరికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ప్రజలను న్యూజిలాండ్ ప్రభుత్వం హెచ్చరించింది.

## చివరి ఆయకట్టు వరకు గోదావరి జలాలే లక్ష్యం: భట్టి విక్రమార్క

### -ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి.
### -ఒక్క రూపాయి వృథా కాకుండా పూర్తి చేస్తామని హామీ

ఖమ్మం, జులై 16: రాష్ట్రంలో గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అశ్వాపురంలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వద్ద గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బృహత్ నీటిపారుదల ప్రణాళికలో భాగంగానే సీతారామ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నామని, ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు.

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దుమ్ముగూడెం రాజీవ్ సాగర్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును రీడిజైన్ చేసి సీతారామ ప్రాజెక్టుగా మార్చిందని అన్నారు. అలాగే ఇందిరా సాగర్ ప్రాజెక్టును పూర్తిగా పక్కనపెట్టి, రీడిజైన్ పేరుతో ప్రజాధనాన్ని అధికంగా ఖర్చు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే ఖర్చు చేసిన ప్రజాధనాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను నిలిపివేయకుండా, వీలైనంత త్వరగా ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు.

గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుబాటులోకి వచ్చిన ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి రైతాంగానికి అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించి తెలంగాణ రైతాంగానికి సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు పనులను గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. గోదావరి జలాలను గ్రావిటీ, లిఫ్ట్ ఇరిగేషన్ విధానాల ద్వారా పూర్తిస్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవల దేవాదుల ఎత్తిపోతల పథకంలోని సమ్మక్క బ్యారేజీ బ్యాక్‌వాటర్ వద్ద అన్ని పంపులను పూర్తి సామర్థ్యంతో నడిపించి 12 జిల్లాలు, 17 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 22 రిజర్వాయర్లను నింపిన విషయాన్ని గుర్తు చేశారు.

**చివరి ఆయకట్టుకు నీరే లక్ష్యం**



సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను చివరి ఆయకట్టు వరకు చేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ ప్రాంత రైతులకు గోదావరి నీరు అందించాలనే సంకల్పంతో రాజీవ్ సాగర్ (దుమ్ముగూడెం), ఇందిరా సాగర్ ఎత్తిపోతల పథకాలు రూపుదిద్దుకున్నాయని చెప్పారు.

రాజీవ్ సాగర్ ప్రాజెక్టును రూ.1,681 కోట్ల అంచనా వ్యయంతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా రూపొందించారని, గోదావరి?శబరి సంగమ ప్రాంతమైన రుద్రంకోట వద్ద రూ.1,824 కోట్లతో ఇందిరా సాగర్ ప్రాజెక్టును మరో రెండు లక్షల ఎకరాలకు నీరందించేలా ప్రణాళిక రూపొందించారని వివరించారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా మొత్తం నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే అప్పటి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**పునఃరూపకల్పనతో వ్యయం పెరిగింది**

రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2 వేల కోట్ల వరకు ఖర్చు జరిగిందని భట్టి పేర్కొన్నారు. మరో రూ.1,505 కోట్లతో పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ప్రాజెక్టులను పునఃరూపకల్పన చేయడంతో సీతమ్మసాగర్ బ్యారేజీని చేర్చి మొత్తం వ్యయం భారీగా పెరిగిందని విమర్శించారు. ఈ నిర్ణయాల వల్ల రాష్ట్ర ఖజానాపై అదనపు భారం పడిందని తెలిపారు.

**లోపాలను సరిచేసి పూర్తి చేస్తాం**

అయితే ఇప్పటికే ప్రజాధనం భారీగా ఖర్చు కావడంతో ప్రాజెక్టు పనులను నిలిపివేయకుండా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రస్తుతం సీతారామ ప్రాజెక్టులో ఉన్న సాంకేతిక లోపాలను సరిదిద్దుతున్నామని చెప్పారు. డిస్ట్రిబ్యూటరీ కాలువలు, రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు.

రాజీవ్ కాలువను సాగర్ కాలువతో అనుసంధానం చేయడంతో పాటు వైరా, పాలేరు రిజర్వాయర్లకు లింక్ కాలువలు, సొరంగ మార్గాల ద్వారా నీటిని తరలించే పనులు చేపట్టామని తెలిపారు. సత్తుపల్లి వరకు సాగునీరు చేరేలా పనులను వేగవంతం చేస్తున్నామని, ఇందుకోసం నెలవారీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నిరంతర సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

"ఇది ప్రజా ప్రభుత్వం. ప్రజల డబ్బులో ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఇప్పటికే జరిగిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూరుస్తాం" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

గోదావరి చివరి ప్రాంతంలో ఉన్న ఈ ప్రాజెక్టు ద్వారా సాధ్యమైనంత ఎక్కువ నీటిని వినియోగించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల రైతుల చిరకాల సాగునీటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## 9వ తరగతిలో మూడో భాష వద్దు.. కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక సూచన..

హైదరాబాద్, జులై 16:9వ తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు పునాది వేసే ఈ దశలో కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులపై అదనపు ఒత్తిడిని పెంచుతుందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో 9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది

సీబీఎస్ఈ అమలు చేస్తున్న మూడు భాషల విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కొత్త భాషను నేర్చుకోవడం మంచిదేనని, అయితే బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో విద్యార్థులపై అదనపు భారం వేయడం సమంజసం కాదని అభిప్రాయపడింది. కొత్త భాషను చిన్న తరగతుల నుంచే బోధిస్తే విద్యార్థులకు అలవాటు కావడానికి సమయం దొరుకుతుందని పేర్కొందిఇటీవల సీబీఎస్ఈ 9వ తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు, పాఠశాలలు, విద్యార్థుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమలుకు తగిన సమయం ఇవ్వలేదని, తగిన పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవని, అలాగే ఇతర సౌకర్యాలు కూడా పూర్తి స్థాయిలో లేవని విమర్శలు వచ్చాయి

కాగా, సుప్రీంకోర్టు ప్రస్తుతం ఈ విధానాన్ని పూర్తిగా నిలిపివేయలేదు. అయితే 9వ తరగతిలో మూడో భాషను తప్పనిసరి చేయడంపై కేంద్రం మరోసారి ఆలోచించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణలో కేంద్రం, సీబీఎస్ఈ తమ వైఖరిని వివరించనున్నాయి.

## జన్నారంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి శ్రీకారం



మంచిర్యాల ,జులై 16: మంచిర్యాల జిల్లా జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం మధ్యాహ్నం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసిహుల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీర నందునాయక్, ప్రధాన కార్యదర్శి ఎం. మాణిక్యం, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎర్ర చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసాక్, జిల్లా కార్యదర్శి ముజఫర్, నాయకులు శంకరయ్య, వెంకటి, సాహెల్, రాజేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సాగుకు మూడు దశల్లో నీటి సరఫరా

### -జూలై 16 నుంచి తొలి తడి ప్రారంభం
### -ప్రాజెక్టులో నీటి లభ్యతను బట్టి నాలుగో తడి విడుదల

సూర్యాపేట, జులై 16: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అందించేందుకు మూసీ ప్రాజెక్టు అధికారులు నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించారు. గురువారం (జూలై 16) నుంచి కాలువల ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. మూడు దశల్లో నీటిని విడుదల చేయనున్నట్లు, ప్రాజెక్టులో నీటి నిల్వలను బట్టి అవసరమైతే నాలుగో తడిని కూడా అందిస్తామని అధికారులు తెలిపారు. మొదటి దశలో జూలై 16 నుంచి ఆగస్టు 5 వరకు 20 రోజుల పాటు కాలువల ద్వారా నీటిని విడుదల చేయనున్నారు. అనంతరం 15 రోజుల విరామం ఇచ్చి, రెండో దశలో ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 4 వరకు మరో 15 రోజుల పాటు నీటిని సరఫరా చేస్తారు. ఇక మూడో దశలో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు 15 రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నారు. మొత్తం మూడు దశల్లో రైతులకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు.

**2.819 టీఎంసీల నీటి వినియోగం**

ప్రస్తుతం ప్రాజెక్టులో 640.92 అడుగుల నీటిమట్టం వద్ద 3.098 టీఎంసీల నికర నీరు అందుబాటులో ఉంది. మూడు దశల్లో మొత్తం 2.819 టీఎంసీల నీటిని వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం సుమారు 0.279 టీఎంసీల నికర నీరు మిగిలే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటి లభ్యతను బట్టి నాలుగో తడి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ బలోపేతంతో ప్రపంచ శాంతి !

## (17 జూలై "ప్రపంచ అంతర్జాతీయ న్యాయ దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో అశాంతి, అసహనాలు అసాధారణంగా పెరుగుతున్నాయి. యుద్ధాల్లో చిన్నారులు సహితం సమిధలు అవుతున్నారు. మారణహోమాలు యధేచ్ఛగా రెక్కలు విచ్చుకుంటున్నాయి. మానవత్వాలు మంటగలుస్తున్నాయి. ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. మానవ హక్కుల హననాలు నిత్యకృత్యం అవుతున్నాయి. రాజకీయ కీచులాటలు రక్తం చిందుస్తున్నాయి. యుద్ధ నేరాలు పెచ్చరిల్లుతున్నాయి. అంతర్జాతీయంగా న్యాయ దేవత ఒంటరి పోతున్నది. అంతర్జాతీయ న్యాయం దూరపు కొండ వలె కనిపిస్తున్నది. అంతర్జాతీయ న్యాయం అనగా మారణహోమం, మానవాళికా వ్యతిరేకంగా నేరాలు, యుద్ధ నేరాలు, హింస, బలవంతపు కిడ్నాపులు లాంటి తీవ్రమైన నేరాలకు జవాబుదారీతనం పొందడం అని అర్థం చేసుకోవాలి. పలు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు, పలు జాతుల మధ్య కొనసాగుతున్న సంఘర్షణలు ప్రపంచ శాంతికి విఘాతంగా నిలుస్తున్నాయి. యుద్ధాలు నేరాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. యుద్ధాల్లో జరుగుతున్న అఘాయిత్యాలకు అంతర్జాతీయ పౌర సమాజమే బాధ్యత వహించాలి. న్యాయం కోసం ప్రపంచ మానవాళి గళం విప్పాలి. "ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసిసి)" తన విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, మానవ హక్కులను పునర్ ప్రతిష్టించాలి.

### ప్రపంచ శాంతి స్థాపనకు తీవ్ర విఘాతాలు:

ఉక్రెయిన్, గాజా, ఇరాన్, ఆఫ్రికాల్లో సాధారణ పౌర సమాజం ఆక్రందనాలు హద్దులు దాటుతున్నాయి. ప్రపంచ స్థాయిలో మానవాళి ఎదుర్కొంటున్న ఇలాంటి వేదనలకు అంతర్జాతీయ స్థాయిలో న్యాయం కల్పించడానికి 1998 నుంచి ప్రతి ఏట 17 జూలై రోజున "ప్రపంచ అంతర్జాతీయ న్యాయ దినోత్సవం" లేదా "వరల్డ్ డే ఫర్ ఇంటర్నేషనల్ జస్టిస్"ను పాటించడం జరుగుతున్నది. 17 జూలై 1998న "అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు" స్థాపించబడడంతో దానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. 2026 ప్రపంచ అంతర్జాతీయ న్యాయ దినోత్సవం ఇతివృత్తంగా "సామాజిక అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం పునరంకితం అవుదాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. నేటి డిజిటల్ ప్రపంచంలో బహు పాక్షికవాదం, న్యాయ సూత్రాలు పలు సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ శాంతి, జవాబుదారీతనం, బాధితులకు హక్కులను కల్పించడం మరో సవాలుగా నిలుస్తున్నది. దేశాల సరిహద్దులు దాటి రాజకీయ ప్రాధాన్యాలను మరిచి సమ న్యాయ కల్పనకు నడుం బిగించాల్సిన సమయం ఆసన్నం అయ్యింది. నేడు సాధారణ పౌరులకు న్యాయం, జవాబుదారీతనం, మానవ హక్కుల పరిరక్షణలు పొందే కనీస హక్కులను వారికి కల్పించాలి. మారణోమం, ఊచకోతల్ని మనందరం నిర్భయంగా వ్యతిరేకించాలి. ఐసిసికి పూర్తి స్వేచ్ఛను కల్పించి సత్వర న్యాయాన్ని సుసాధ్యం చేయాలి. తీవ్రమైన నేరాలను అంతర్జాతీయ న్యాయ స్థానం తీవ్రమైనవిగా భావించాలి.

### ప్రపంచ అంతర్జాతీయ న్యాయ దినోత్సవ కార్యక్రమాలు:

చట్ట పాలన, మానవ హక్కుల రక్షణ, తీవ్రమైన నేరాలకు జవాబుదారీతనం, దురాక్రమణ చర్యలను నివారించడం, మారణహోమాలకు ఐసిసి నిబద్ధతను పునరుద్ఘాటించాలి. అంతర్జాతీయ నేరాలకు పాల్పడిన వ్యక్తులకు తగు శిక్షలు విధించాలి. ప్రపంచ స్థాయిలో శాంతి భద్రతలను కాపాడడం, భవిష్యత్తు దురాగతాలను నివారించడానికి ఐసిసి మెరుగైన పాత్రను నిర్వహించాలి. ప్రపంచ అంతర్జాతీయ న్యాయ దినోత్సవ వేదికగా అవగాహనలు పెంచడం, మానవ హక్కుల పరిరక్షణ సంస్థలకు మద్దతు ఇవ్వడం, సెమినార్లు/కార్యశాలలు నిర్వహించడం, ఐసిసిని బలోపేతం చేయడం, ప్రపంచ న్యాయం కోసం పరితపించడం లాంటివి విధిగా నిర్వహించాలి.

అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం, అమాయక బాధితులకు సత్వర న్యాయం కల్పించడంమారణహోమాలకు అడ్డుకట్ట వేయడం, మానవీతకు పట్టం కట్టడం, మానవాళి శ్రేయస్సుకు గొడుగులు పట్టడం లాంటివి నిరంతరం కొనసాగితేనే ప్రపంచ శాంతి పావురం స్వేచ్ఛగా తిరుగుతుంది.



-మధుపాలీ
9949700037

# జస్టిస్ బీ.ఆర్. గవాయ్ న్యాయ ప్రస్థానం రాజ్యాంగ విలువల పట్ల అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, జులై 16:ఉపరాష్ట్రపతి భవన్‌లో ఈ రోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో "ది వాయిస్ ఆఫ్ జస్టిస్: జస్టిస్ గవాయి స్పీక్స్" అనే పుస్తకాన్ని భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీ. పీ. రాధాకృష్ణన్ విడుదల చేశారు. ప్రొఫెసర్ ఎస్. శివకుమార్ సంపాదకత్వంలో, కామన్వెల్త్ లీగల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (సీ.ఎల్.ఈ.ఏ.) సహకారంతో థామ్సన్ రాయిటర్స్ ప్రచురించిన ఈ సంపుటిలో... భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్. గవాయి ప్రసంగాలు, ఉపన్యాసాలు, ఆలోచనలను పొందుపరిచారు.

ఈ సభనుద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ... అనుభవం, రాజ్యాంగపరమైన క్రమశిక్షణ, ప్రజల బాధ్యతలతో రూపుదిద్దుకున్న న్యాయపరమైన ఆలోచనలను ప్రతిబింబించే ఒక ముఖ్యమైన రాజ్యాంగ పత్రంగా ఈ పుస్తకాన్ని అభివర్ణించారు. రాజ్యాంగవాదం, చట్టబద్ధ పాలన, సామాజిక న్యాయం, ప్రజాస్వామిక పాలనపై విలువైన అవగాహనను ఈ పుస్తకం అందిస్తుందన్నారు. ఇది రాజ్యాంగ విలువల గురించి, న్యాయ శాస్త్రంలోని విషయాలను గురించి దేశ ప్రజల్లో అవగాహనను మరింత పెంపొందిస్తుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

రాజ్యాంగంపై పుస్తకంలోని విశ్లేషణలను ప్రస్తావిస్తూ... గత డెబ్బయి ఐదు సంవత్సరాలుగా నిరంతర కొనసాగింపు, మార్పు, అధికారం, జవాబుదారీతనం, హక్కులు, విధుల మధ్య సమతుల్యతను పాటిస్తున్న ఒక సజీవమైన, నిరంతరం పరిణామం చెందుతున్న పత్రంగా భారత రాజ్యాంగాన్ని ఈ పుస్తకం సరిగ్గా చిత్రీకరిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్య స్థిరత్వానికి, జాతీయ ఐక్యతకు రాజ్యాంగం పునాదిగా నిలుస్తుందన్నారు. దానిని సవరించేందుకు పార్లమెంటుకు గల అధికారం, మారుతున్న కాలపు అవసరాలను తీర్చడానికి దేశానికి వీలు కల్పిస్తుందని ఉపరాష్ట్రపతి అభిప్రాయపడ్డారు.

రాజ్యాంగ పాలనను పరిరక్షించడంలోనూ, చట్టబద్ధమైన పాలనపై పౌరుల విశ్వాసాన్ని కాపాడటంలోనూ న్యాయవ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని శ్రీ రాధాకృష్ణన్ అన్నారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో అధికారంతో పాటు సంయమనమూ అంతే ముఖ్యమన్నారు. సంస్థాగత సమగ్రత, రాజ్యాంగ క్రమశిక్షణ, ప్రజా విశ్వాసం, ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధత ద్వారానే పటిష్ఠమైన సంస్థలు, న్యాయం నిలబడతాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

రాజ్యాంగబద్ధమైన పాలన సాధారణ పౌరుల ఆకాంక్షలకు, మారుతున్న సామాజిక వాస్తవాలకు అనుగుణంగా ఉండాలని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతి వ్యక్తికీ గౌరవం, అవకాశం, ఆశ కల్పించాలంటే అణగారిన వర్గాల ను బలోపేతం చేయడం అత్యవసరమని శ్రీ రాధాకృష్ణన్ అభిప్రాయపడ్డారు. న్యాయవ్యవస్థకు జస్టిస్ బీ.ఆర్. గవాయి చేసిన సేవలను ప్రశంసిస్తూ... ఆయన న్యాయ ప్రస్థానం రాజ్యాంగ విలువలు, సంస్థాగత సమతుల్యత, న్యాయం అందరికీ అందుబాటులో ఉండటం పట్ల ఆయనకున్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

న్యాయం అందరికీ అందుబాటులో ఉండేందుకు వీలుగా నిరుపేదలకు ఎల్లప్పుడూ ఉచితంగా న్యాయ సహాయం అందించాలని న్యాయవాద సంఘ సభ్యులను కోరుతూ ఉపరాష్ట్రపతి తన ప్రసంగాన్ని ముగించారు.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్. గవాయి, కామన్వెల్త్ లీగల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (సీ.ఎల్.ఈ.ఏ.) అధ్యక్షులు, సంపాదకులు ప్రొఫెసర్ ఎస్. శివకుమార్, థామ్సన్ రాయిటర్స్ ప్రచురణకర్త శ్రీ గౌరీ శంకర్ నటేశన్, న్యాయవాద సంఘ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం..




ఆదిలాబాద్, జులై 16: తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే భూ భారతి రీ-సర్వే ప్రధాన లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హీరాపూర్ గ్రామంలో గురువారం పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూ భారతి రీ-సర్వే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి సన్మానించారు.


ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతికత, డ్రోన్లు, రోవర్లు, జీపీఎస్ సహాయంతో భూముల సరిహద్దులను శాస్త్రీయంగా కొలిచి, ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని తెలిపారు.

భూ సర్వే కోసం గ్రామాలకు వచ్చే అధికారులకు ప్రజలు పూర్తి సహకారం అందించి రీ-సర్వేను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అలాగే ఎస్ఐఆర్ సర్వేలో ఎన్యూమరేషన్ ఫారాలను వంద శాతం సమర్పించి అధికారులకు సహకరించిన హీరాపూర్ గ్రామస్తులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాథోడ్ మోహన్ సింగ్, తహసీల్దార్ కోట్నక్ రఘునాథరావు, స్థానిక సర్పంచ్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆహ్వానం



వేముల సత్యనారాయణ రచన
నేనూ... నా ప్రపంచం
ఉద్యోగ ప్రస్థానం
(యాభై రెండేళ్ల డైరీ కథనం)



పుస్తకావిష్కరణ సభ
వేదిక : ఫిలింభవన్, కరీంనగర్.
జులై 19, 2026 ఆదివారం ఉ. 10 గం.లకు
సభాధ్యక్షులు :
అన్నవరం దేవేందర్, కవి, రచయిత, రాష్ట్ర ప్రభుత్వ దాశరథి పురస్కార గ్రహీత
ముఖ్య అతిథి-ఆవిష్కర్త :
డా. మచ్చ హరిదాసు, కవి, రచయిత
విశిష్ట అతిథులు :
డా. నలిమెల భాస్కర్, బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
జూకంటి జగన్నాథం, కవి, రచయిత, రాష్ట్ర ప్రభుత్వ దాశరథి పురస్కార గ్రహీత
పెద్దింటి అశోక్ కుమార్, కథా, నవలా సినీ రచయిత
పుస్తక సమీక్ష :
డా. బి.వి.ఎన్.స్వామి, కథారచయిత, విమర్శకుడు
ఆత్మీయ అతిథులు :
బూర్ల వేంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కవి, రచయిత
అన్నాడి గజేందర్ రెడ్డి, కవి, విమర్శకులు, గాయకులు
కూకట్ల తిరుపతి, సభా సమన్వయం 9949247591
సాహితీ సోపతి కరీంనగర్, తెలంగాణ


## సిసి రోడ్డు నిర్మాణపనులు ప్రారంభం

ఆదిలాబాద్, జులై 16: చెన్నూరు మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డులో సి.ఎస్.ఆర్ (అ.నా.ఖీ.)నిధుల తో నిర్మించనున్న సిసిరోడ్డు పనులను మున్సిపల్ చెర్ పర్సన్ పెద్దింటి పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా చెర్ పర్సన్ మాట్లాడుతూ సిఎస్ఆర్ నిధులనుంచి సిసి రోడ్డు నిర్మాణానికి 22 లక్షల 50 వేల రూపాయలు మంజూరుఅయ్యాయని. ఈ రోడ్డు బోయ కిష్టయ్య ఇంటి నుండి చెన్న శ్రీనివాస్ ఇంటి వరకు నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ అంబటి శంకర్. కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దింటి శ్రీనివాస్, సుశీల్ కుమార్ చెన్నవెంకటేష్, తనుగుల సతీష్, సలీం, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# శతాబ్ద కాలం భూ వివాదానికి తెర!

## -పట్టాల మార్గం సుగమం 8.10 ఎకరాల భూమి వివాదం పరిష్కారం




కర్నూల్,జులై 16: వందేళ్లుగా రెవెన్యూ రికార్డులు, యాజమాన్య వివాదాలు, పరిపాలనా చిక్కుల్లో ఇరుక్కుపోయిన కర్నూలు జిల్లా కల్లూరు ఎస్టేట్ భూమి సమస్యకు ఎట్టకేలకు తెరపడింది. కల్లూరు మండలంలోని సర్వే నంబర్ 448/ఏ3లోని 8.10 ఎకరాల భూమికి సంబంధించి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవతో వివాదాన్ని పరిష్కరించడంతో దాదాపు 500 నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాల పట్టాలు అందించే మార్గం సుగమమైంది. ఈ పరిణామంతో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది.

### 100 ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం 500 కుటుంబాలకు ఊరట

నగరంలోని కల్లూరు మండలం ఎస్టేట్‌లోని సర్వే నంబర్ 448/ఏ3లో ఉన్న 8.10 ఎకరాల భూమికు సంబంధించిన శతాబ్ద కాలం నాటి భూ సమస్య పరిష్కారమవడంతో సుమారు 500 కుటుంబాలకు ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేసే ప్రక్రియ వేగం పుంజుకుంది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి నేతృత్వంలో రెవెన్యూ అధికారులు రికార్డులను సమగ్రంగా పరిశీలించి వివాదానికి ముగింపు పలికినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ పంపిణీకి మార్గం సుగమమైంది.

అసలు సమస్య ఏమిట కల్లూరు ఎస్టేట్ పరిధిలోని ఈ భూమికి సంబంధించిన రికార్డులు పాత సెటిల్మెంట్ పత్రాలు, యాజమాన్య హక్కులు, రెవెన్యూ నమోదుల్లో ఉన్న వ్యత్యాసాల కారణంగా చాలా కాలంగా వివాదాస్పదంగా మారాయి. భూమి ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చినప్పటికీ, పూర్తి స్థాయిలో రికార్డుల స్పష్టత లేకపోవడంతో పట్టాల పంపిణీ నిలిచిపోయింది. ఇలాంటి పాత రికార్డుల ఆధారంగా ఏర్పడిన భూ వివాదాలు కర్నూలు జిల్లాలో అనేక ప్రాంతాల్లో గతంలోనూ న్యాయస్థానాల వరకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి.

### ప్రత్యేక చొరవతో పరిష్కారం..

జిల్లా యంత్రాంగం రెవెన్యూ రికార్డులు, పాత ఫైళ్లు, సెటిల్మెంట్ వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించింది. దీంతో ఈ భూమిని గృహ స్థలాల పంపిణీకి వినియోగించే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం అర్హులైన కుటుంబాలకు పట్టాలు జారీ చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

### 500 కుటుంబాలకు శాశ్వత భరోసా..

ఇంటి స్థలం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేద కుటుంబాలకు ఈ నిర్ణయం పెద్ద ఊరటగా మారింది. స్వంత ఇంటి కలను సాకారం చేసుకునే అవకాశం లభించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూ వివాదం తొలగిపోవడంతో భవిష్యత్తులో గృహ నిర్మాణాలకు కూడా ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు ఉండవని అధికారులు పేర్కొంటున్నారు.

### కలెక్టర్‌కు ఘన సన్మానం..

భూ సమస్య పరిష్కారమైన సందర్భంగా లబ్ధిదారులు కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరితో పాటు జాయింట్ కలెక్టర్‌ను సన్మానించారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ నిర్ణయం తమ కుటుంబాల జీవితాల్లో కొత్త ఆశలు నింపిందని పేర్కొన్నారు.

### ఇంకా ఇలాంటి భూ సమస్యలపైనా దృష్టి..

కల్లూరు ఎస్టేట్ భూమి వివాదం పరిష్కారం కావడంతో జిల్లాలో ఇదే తరహాలో పెండింగ్‌లో ఉన్న ఇతర భూ సమస్యల పరిష్కారానికి కూడా ఊతం లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాత రికార్డుల సవరణ, భూ హక్కుల స్పష్టత, అర్హులకు చట్టబద్ధంగా పట్టాల పంపిణీపై ప్రభుత్వం మరింత దృష్టి సారించే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి.

# రాయలసీమకు లైఫ్‌లైన్ హంద్రీనీవా

## -ప్రెస్‌మీట్‌లో ప్రకటించిన అనంత వెంకటరామిరెడ్డి, శైలజానాథ్, విశ్వేశ్వరరెడ్డి



అమరావతి, జులై 16: కరువుకు నిలయంగా ఉన్న రాయలసీమకు హంద్రీనీవా ప్రాజెక్టు లైఫ్‌లైన్ అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. రాయలసీమకు అదనపు జలాలే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే రాయలసీమ ఎత్తిపోతల పథకం, గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల సాధన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటైందన్నారు.

గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో అనంతతో పాటు మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులను అన్ని జిల్లాల్లో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీలు అధ్యయనం చేసి అదనపు జలాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు.

ఇందులో భాగంగా ఈనెల 19వ తేదీన కూడేరు మండలం చోళసముద్రం వద్ద హంద్రీనీవా పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. వాస్తవానికి హంద్రీనీవా ద్వారా 6.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల జనాభాకు తాగునీరు అందాల్సి ఉందన్నారు. ఎన్టీఆర్ హయాంలో హంద్రీనీవాకు రూపకల్పన చేశారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 1996లో ఉరవకొండ వద్ద 40 టీఎంసీలకు శంకుస్థాపన చేశారన్నారు.

ఆ తర్వాత 1999లో ఆత్మకూరు వద్ద 5 టీఎంసీలకు కుదించిన విషయాన్ని గుర్తు చేశారు. 2004 వరకు హంద్రీనీవా పనులు ముందుకు సాగలేదని, వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక 2005లో 5 టీఎంసీల జీవో రద్దు చేసి 40 టీఎంసీల సామర్థ్యంతో పనులు శరవేగంగా చేపట్టారని తెలిపారు. దాని ఫలితంగానే 2012లో కృష్ణా జలాలు హంద్రీనీవా ద్వారా జీడిపల్లికి వచ్చాయని అన్నారు.

చంద్రబాబు నిర్లక్ష్యం కారణంగానే నికర జలాలు లేకుండా మిగులు జలాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు వచ్చాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.3850 కోట్లతో పనులు చేశామని గొప్పలు చెబుతున్నారని, కానీ అనుకున్న మేరకు నీళ్లు రాలేదన్నారు. ఓ వైపు తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలంలో 800 అడుగుల నుంచే నీళ్లు తరలిస్తుండడం వల్ల సీమ ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతోందన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో హంద్రీనీవాను 6300 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసే పనులకు శ్రీకారం చుట్టి టెండర్లు కూడా పూర్తి చేశామన్నారు. ఆలోగా ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో మళ్లీ చంద్రబాబు 3850 క్యూసెక్కులకే హంద్రీనీవాను పరిమితం చేశారన్నారు. తక్కువ సమయంలోనే 51 టీఎంసీలు తెచ్చామని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవ పరిస్థితి అలా లేదని తెలిపారు.

నిజంగా 3850 క్యూసెక్కులు వచ్చి ఉంటే 170 రోజుల్లోనే 51 టీఎంసీలు వస్తాయని, మరి 242 రోజులు ఎందుకు పట్టిందని ప్రశ్నించారు. పైగా హంద్రీనీవా ప్రధాన కాలువను కుదించి బ్రాంచ్ కెనాళ్లను పెంచడం గతంలో ఎక్కడా జరగలేదని తెలిపారు. హంద్రీనీవా లైనింగ్ పనుల కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోయినట్లు చెప్పారు. హంద్రీనీవా పనుల విషయంలో అంచనాలు పెరగడం తప్పితే ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. ఈ క్రమంలోనే ఈనెల 19వ తేదీన హంద్రీనీవా పనులను కూడేరు మండలం చోళసముద్రం వద్ద పరిశీలించనున్నట్లు చెప్పారు.

# దేశ శ్రమశక్తికి 'సేవ'.. గౌరవమే మా పాలనలో ప్రధానాంశాలు: డాక్టర్ మన్‌సుఖ్ మాండవ్య


న్యూ ఢిల్లీ, జులై 16:కేంద్ర కార్మిక-ఉపాధి, యువజన వ్యవహారాలు-క్రీడా శాఖల మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవ్య ఈ రోజు తెలంగాణలోని సనత్‌నగర్‌లోగల 'ఈఎస్‌ఐసీ' ఆసుపత్రి ప్రాంగణంలో రూ. 211.13 కోట్లతో నిర్మించిన అవుట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) భవనాన్ని ప్రారంభించారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గల 12.3 లక్షల మందికి పైగా బీమా చందాదారులు, ఇతర లబ్ధిదారులకు విస్తృత సేవలు లభిస్తాయి.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి ప్రసంగిస్తూ- దేశ పురోగమనంలో 'శ్రమశక్తి', 'యువశక్తి' రెండు కీలక స్తంభాలని డాక్టర్ మాండవ్య గుర్తుచేశారు. నేటి ఆధునిక యుగంలో ప్రగతి దిశగా సాంకేతిక పరిజ్ఞానాలు, కృత్రిమ మేధ ప్రధాన కారకాలైనప్పటికీ, 'శ్రమశక్తి' కీలక పాత్ర పోషిస్తుందనడంలో సందేహం లేదన్నారు. ఈ కర్తవ్య నిర్వహణలో కార్మికులకు మరింత సమర్థంగా తోడ్పడే విధంగా వారికి గౌరవం, సామాజిక భద్రత కల్పన అత్యావశ్యకమని ఆయన స్పష్టం చేశారు. ఆ మేరకు దేశ శ్రమశక్తికి సేవ, గౌరవమే శ్రీ మోదీ ప్రభుత్వ పాలనలో ప్రధానాంశాలుగా ఉన్నాయని ప్రకటించారు.

సామాజిక భద్రత బలోపేతం దిశగా ప్రభుత్వ కృషిని వివరిస్తూ- దశాబ్దం కిందట ఈఎస్ఐసీ లబ్ధిదారుల సంఖ్య సుమారు 7.5 కోట్లు కాగా, నేడు రెట్టింపు పెరుగుదలతో 15 కోట్లు దాటిందని డాక్టర్ మాండవ్య తెలిపారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) అంచనాలను ప్రస్తావిస్తూ- భారత్‌లో సామాజిక భద్రత పరిధి 2014లో 19 శాతం కాగా, ఇప్పుడు 64 శాతం దాటిందని పేర్కొన్నారు. తద్వారా 94 కోట్ల మంది ప్రజలు దీని పరిధిలోకి వచ్చారని ఆయన వివరించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వాన అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రస్తావిస్తూ- 80 కోట్ల మందికి పైగా పేదలకు ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ సహా అర్హతగల పేద కుటుంబాల కోసం 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లు నిర్మించినట్లు గుర్తుచేశారు. భారత కార్మికవర్గ జీవన ప్రమాణాల మెరుగుదలకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు.

దేశంలో కార్మిక సంస్కరణల గురించి మాట్లాడుతూ- మునుపటి 29 చట్టాల స్థానంలో ప్రభుత్వం 4 కొత్త కార్మిక చట్టాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. దీనివల్ల సరళ, కార్మిక-ప్రాధాన్య కార్మిక విధానానికి బాటలు పడ్డాయని కేంద్ర మంత్రి తెలిపారు. నియామక పత్రాల జారీని తప్పనిసరి చేయడమే కాకుండా 40 ఏళ్లు పైబడిన కార్మికులకు ఏటా ఉచిత ఆరోగ్య పరీక్షలు, స్త్రీ-పురుషులకు సమాన వేతనం, ఏడాది సేవలు పూర్తిచేసిన వారికీ గ్రాట్యుటీ పొందే అర్హత వంటి అంశాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. పరిశ్రమలు-కార్మిక శక్తి మధ్య సామరస్యపూర్వక సంబంధాల ప్రాధాన్యాన్ని స్పష్టం చేశారు. వికసిత, సుసంపన్న భారత్ రూపకల్పన దిశగా యాజమాన్యాలు-ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని డాక్టర్ మాండవ్య పిలుపునిచ్చారు.

## కారు-బైకు ఢీకొని ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



కరీంనగర్, జులై 16: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు, బైకు పరస్పరం ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం, ఈ ప్రమాదంలో వేములవాడకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం. దేవుని తండాకు చెందిన మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న చందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కార్గిల్ విజయ్ దివస్-2026: జాతీయ యుద్ధ స్మారకం నుంచి కార్గిల్ యుద్ధ స్మారకం వరకూ మోటార్‌సైకిల్ ర్యాలీ.. ప్రారంభించిన రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, జులై 16:దేశవ్యాప్తంగా 'కార్గిల్ విజయ్ దివస్-2026'ను పాటిస్తున్నారు. దీనిలో భాగంగా, న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం వద్ద నుంచి లద్దాఖ్.. ద్రాస్‌లో గల కార్గిల్ యుద్ధ స్మారకం వరకూ 13 రోజుల "శౌర్య విజయ్ యాత్ర"ను

కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ 2026 జులై 14న ప్రారంభించారు. సర్వీసులో ఉన్న, పదవీ విరమణ చేసిన రక్షణ బలగాల సిబ్బందీ, వారి కుటుంబ సభ్యులూ సహా 28 మంది మోటార్ సైకిలిస్టులు ఈ యాత్రలో భాగంగా ఉత్తర హిమాలయాల్లోని దుర్గమ ప్రాంతం గుండా 1,900 కిలోమీటర్ల మేర యాత్రను నిర్వహిస్తారు. 1999లో కార్గిల్ యుద్ధంలో గెలుపును నిర్ధారించిన భారత వీరుల అజేయ సాహసం, దృఢ సంకల్పం, అత్యున్నత త్యాగాలకు ఈ యాత్ర శ్రద్ధాంజలి ఘటిస్తోంది. 'ఒక యాత్ర, ఒక దేశం, ఒక ప్రణామం' ఈ యాత్రకు ఆదర్శ వాక్యంగా ఉంది.

రక్షణ మంత్రి తన ప్రసంగంలో వీర భారతీయ సైనికులకు నివాళులను అర్పించారు. ధైర్య సాహసాలనీ, క్రమశిక్షణనీ, సాటి లేని దేశ భక్తినీ మేళవించి వారంతా సువర్ణాధ్యాయాన్ని లిఖించారనీ, ఈ అధ్యాయాన్ని ప్రపంచ వ్యాప్తంగా- సేనలు నేటికీ అధ్యయనం చేస్తున్నాయనీ మంత్రి అన్నారు. "దాదాపు 20,000 అడుగుల ఎత్తులో, మైనస్ 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో.. మన జవాన్లు సాహసంతో, దృఢత్వంతో లక్ష్యాన్ని చేజిక్కించుకున్నారు. శత్రువు గుప్పిట నుంచి ప్రతి శిఖరాన్నీ, పర్వతాన్నీ, బంకరునూ తిరిగి స్వాధీనం చేసుకున్నారు. త్రివర్ణ పతాక గౌరవాన్ని నిలబెట్టారు. మన భూమిమీదా, మన గుర్తింపుమీదా, మన గౌరవం మీదా శత్రుత్వ భావనతో దుస్సాహసానికి పాల్పడిన వారు ఎవరైనా, పూర్తి శక్తితో జవాబు ఇవ్వగలిగిన భారత్ అజేయ సంకల్పానికి ఈ విజయం నిదర్శనం" అని ఆయన అన్నారు.

ప్రతి యుద్ధంలోనూ విజయాన్ని అందించినందుకు భారతీయ సైనికులందరికీ శ్రీ రాజ్‌నాథ్ సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన కృతజ్ఞతలు తెలిపిన వారిలో పరమ వీర చక్ర గ్రహీతలైన కెప్టెన్ విక్రమ్ బాత్రా, లెఫ్టినెంట్ మనోజ్ కుమార్ పాండే, సుబేదార్ మేజర్ (ఆనరరీ కెప్టెన్) యోగేంద్ర సింగ్ యాదవ్ (రిటైర్డ్), సుబేదార్ మేజర్ (ఆనరరీ కెప్టెన్) సంజయ్ కుమార్ (రిటైర్డ్) కూడా ఉన్నారు. ఈ వీర సైనికులు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారనీ, రాబోయే తరాల వారికి కూడా వీరు స్ఫూర్తిని అందిస్తుంటారనీ మంత్రి ప్రశంసించారు.

మోటారు సైకిళ్ల మీద వెళ్లే వారు మార్గమధ్యంలో చండీమందిర్ యుద్ధ స్మారకం, రెజాంగ్ లా యుద్ధ స్మారకం, లే యుద్ధ స్మారకం, ప్రధాన సైన్య స్మారకం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తారు. వీర మహిళలతో కూడా వారు భేటీ అవుతారు. అజేయ సాహసాన్నీ, ధీరత్వాన్నీ చాటినందుకు వారిని సత్కరిసారు. 2026 జులై 26న కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధ స్మారకానికి చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది.

జాతీయ యుద్ధ స్మారకంలోని పవిత్రమైన మట్టిని నింపిన కలశాన్ని మోటార్ సైకిలిస్టులు వెంట తీసుకు వెళ్తారు. ఈ కలశాన్ని కార్గిల్‌లో అమరులైన వీర సైనికుల స్మృతికి అంకితం చేస్తారు. "ఇక్కడి పవిత్రమైన మట్టి.. కార్గిల్ లోని మట్టితో కలిసిపోయే ఘట్టం ఈ దేశ వర్తమాన తరం నమ్మకం, మన అమర వీరుల అజేయ శౌర్య పవిత్ర సంగమానికి ప్రతీకగా నిలుస్తుంది" అని రక్షణ మంత్రి అన్నారు.

శౌర్య విజయ్ యాత్రకు సంబంధించిన ఒక కీలక అంశాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావిస్తూ, ఈ యాత్ర దేశానికి చెందిన వేర్వేరు ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న అధికారులను, పూర్వ సైనికులను, పౌరులను ఒక చోటుకు చేరుస్తోందన్నారు. " "విభిన్న నేపథ్యాలు, భాషలు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ మువ్వన్నెల జెండా, ఒకే దేశం, మన అమర జవాన్ల పట్ల ఉమ్మడి గౌరవం.. ఇవే మన దేశానికి గుర్తింపు" అని ఆయన అన్నారు.

నేషనల్ కేడెట్ కోర్ (ఎన్‌సీసీ)కి చెందిన విద్యార్థులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ యాత్ర ప్రజల్లో, మరీముఖ్యంగా యువతలో దేశభక్తితో ముడిపడిన సరికొత్త భావనను జాగృతం చేస్తుందన్న విశ్వాసాన్ని రక్షణ మంత్రి వ్యక్తం చేశారు. దేశ స్వతంత్రాన్నీ, గౌరవాన్నీ రక్షించడం ఒక్క సరిహద్దులలో మాత్రమే చోటు చేసుకొనేది కాదనీ, అది మన స్మృతులలో, విలువలలో కూడా ఇమిడివుందన్న సందేశాన్ని ఇది భావి తరాలకు అందిస్తుందనీ ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజ సుబ్రమణి, సైనిక దళ ప్రధానాధికారి జనరల్ ధీరజ్ సేఠ్‌తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. 'ఆపరేషన్ విజయ్' వేళ ప్రదర్శించిన విలువలను ముందుకు తీసుకు పోవాలన్న భారత సైన్య నిబద్ధతను శౌర్య విజయ యాత్ర చాటిచెబుతోంది. ఈ సాహస యాత్రను తిరిగి చేపట్టడం ద్వారా కర్తవ్యం, గౌరవం, నిస్వార్థ సేవ అనే ఆదర్శాలను రాబోయే తరాల వారు నిలబెట్టడానికి వారికి స్ఫూర్తిని ఇవ్వనుంది.

# 'భారత సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ కోసం భవిష్యత్తుకు సిద్ధమైన శ్రామిక శక్తి అభివృద్ధి' అంశంపై ప్రసార మాధ్యమాల ఒక రోజు సదస్సు

న్యూఢిల్లీ, జులై 16:" చలనచిత్ర నిర్మాతలు, డిజిటల్ కంటెంట్ సృష్టికర్తలు, ఇతర సృజనాత్మక రంగాల నిపుణులు అత్యాధునిక కంటెంట్‌ను రూపొందిస్తూ, ప్రపంచ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ (ఆరెంజ్ ఎకానమీ) లో భారత్‌కు ప్రత్యేక స్థానం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ ఆరెంజ్ ఎకానమీలో భారత్ సుమారు మూడు శాతం వాటాను కలిగి ఉండగా, రాబోయే దశాబ్దంలో దీనిని 12-15 శాతానికి పెంచాలని దేశం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించే దిశగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ (ఐఐసీటీ) కృషి చేస్తోంది" అని ఐఐసీటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్ ఆశిష్ కుల్కర్ణి ఈరోజు నాగ్‌పూర్‌లో తెలిపారు.

(రైటప్) సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి వివరిస్తున్న శ్రీమతి స్మితా వత్స్ శర్మ

భారత సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ కోసం భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శ్రామికశక్తి అభివృద్ధి అంశంపై సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పత్రికా సమాచార కార్యాలయం (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో - పీఐబి) నాగ్‌పూర్‌లోని చిట్నావిస్ సెంటర్‌లో నిర్వహించిన ఒకరోజు మీడియా వర్క్‌షాప్ 'వార్త' లో డాక్టర్ ఆశిష్ కులకర్ణి ప్రసంగించారు. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పశ్చిమ ప్రాంత డైరెక్టర్ జనరల్ శ్రీమతి స్మితా వత్స్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వివిధ ప్రసార మాధ్యమ సంస్థల సీనియర్ ఎడిటర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ సహకారంతో విద్యార్థుల్లో చిన్న వయసు నుంచే సృజనాత్మకతను పెంపొందించి, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి 'కౌశల్ బోధ్' పాఠ్య ప్రణాళికను ప్రవేశపెట్టనున్నట్లు డాక్టర్ కులకర్ణి తెలిపారు. దేశవ్యాప్తంగా 500 కళాశాలలు, 15 వేల పాఠశాలల్లో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధంగా ఉందని వెల్లడించారు.

ముంబైలోని జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ) ప్రాంగణం నుంచి 2025 జూలైలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ-ఎక్స్ఆర్) రంగానికి జాతీయ అత్యుత్తమత కేంద్రంగా ఐఐసీటీ కార్యకలాపాలు నిర్వహిస్తోందని డాక్టర్ కులకర్ణి తెలిపారు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, విస్తరించిన రియాలిటీ రంగాల్లో నైపుణ్యాధారిత కోర్సులను హబ్-అండ్-స్పోక్ విధానంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కోర్సులు కేవలం ముంబై ప్రధాన కేంద్రానికే పరిమితం కాకుండా, ప్రాంతీయ కేంద్రాలు, చిన్న పట్టణ ప్రాంతాల్లోని కేంద్రాల ద్వారా కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంటాయని వివరించారు.

భారత్ కు ఉన్న గొప్ప కథా సంప్రదాయం, స్వదేశీ విజ్ఞాన వ్యవస్థలను ప్రస్తావిస్తూ, ఈ విజ్ఞాన సంపద ప్రస్తుతం వివిధ డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం పొందుతోందని శ్రీ కులకర్ణి అన్నారు. సృజనాత్మక రంగంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, చలనచిత్ర, సృజనాత్మక సంస్థలు ప్రత్యేక నైపుణ్యాధారిత కోర్సులను రూపొందిస్తున్నాయని తెలిపారు. వీటి ద్వారా నైపుణ్యాభివృద్ధి, సామర్థ్య పెంపునకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని పేర్కొన్నారు.

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, ముంబై ఉప సంచాలకురాలు జయదేవి పూజారి స్వామి స్వాగతోపన్యాసం చేశారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో మీడియా అండ్ కమ్యూనికేషన్ అధికారి సౌరభ్ ఖేకడే కార్యక్రమాన్ని నిర్వహించగా, అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న మీడియా అండ్ కమ్యూనికేషన్ అధికారి ధనంజయ్ వాంకడే కృతజ్ఞతలు తెలిపారు.

# వేములవాడ కళ్యాణకట్టలో ఈవో ఆకస్మిక తనిఖీలు..

## -అదనపు వసూళ్లపై కఠిన హెచ్చరిక

రాజన్న సిరిసిల్ల, జులై 16:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణకట్టలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కళ్యాణకట్టలో భక్తుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఆమె స్వయంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. తలనీలాలు సమర్పించుకునేందుకు వచ్చిన భక్తులతో నేరుగా మాట్లాడి వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా, ఎవరైనా అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే విషయాలను తెలుసుకుని వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.



అనంతరం విధుల్లో ఉన్న నాయి బ్రాహ్మణులను వీడియో రికార్డింగ్ ద్వారా ఇంటర్వ్యూ చేసి వారి వివరాలు సేకరించారు. వారికి వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, కాంట్రాక్టర్ ద్వారా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారా అనే అంశాలపై ఆరా తీశారు. కళ్యాణకట్ట నిర్వహణ కాంట్రాక్టర్‌కు అక్కడ పనిచేసే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా యూనిఫాం, గుర్తింపు కార్డులు అందజేయాలని, కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఆదేశించారు.

భక్తుల నుంచి తలనీలాల కోసం అదనపు డబ్బులు డిమాండ్ చేయడం లేదా వసూలు చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఈవో స్పష్టం చేశారు. అలాంటి ఘటనలు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే కాంట్రాక్టును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చుతామని హెచ్చరించారు. భక్తులకు అవగాహన కల్పించేందుకు తలనీలాల టికెట్ ధర రూ.50 మాత్రమే, అదనపు డబ్బులు చెల్లించవద్దని, అదనపు వసూళ్లు శిక్షార్హమైన నేరమని తెలిపే బోర్డులను ఏర్పాటు చేయించారు. మైక్ ద్వారా నిరంతరం ప్రకటనలు చేయాలని కూడా ఆదేశించారు.

కళ్యాణకట్టలోని రెండు విభాగాలను పరిశీలించిన ఈవో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని అధికారులకు సూచించారు. నగదు వసూళ్లపై నిఘా కోసం ప్రత్యేకంగా ఇద్దరు సిబ్బందిని నియమించాలని, మొత్తం ప్రాంగణం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా ఫిర్యాదులను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనంతరం నిర్వాహణకు సంబంధించిన అధికారులతో సమావేశమైన ఈవో, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, దేవస్థానం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి పారదర్శకమైన, ఇబ్బందుల్లేని సేవలు అందించడమే దేవస్థానం లక్ష్యమని పేర్కొంటూ, ఎవరైనా అదనపు డబ్బులు వసూలు చేస్తే వెంటనే దేవస్థానం అధికారులకు సమాచారం ఇవ్వాలని భక్తులను కోరారు. ఈ తనిఖీల్లో దేవస్థానం డీఈవో నవీన్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, శివసాయి, ఏఈ రామకృష్ణారావు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, జులై 16:భూ భారతి ద్వారా చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన భూ భారతి రీ-సర్వే అవగాహన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్ ద్వారా ఇప్పటికే అనేక భూ సమస్యలు పరిష్కారమయ్యాయని, భూముల విస్తీర్ణంలో తేడాలు, ఇతర భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర రీ-సర్వే చేపడుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో చివరిసారిగా 1937లో భూ సర్వే జరిగిందని, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలోని 190 రెవెన్యూ గ్రామాల్లో తొలి దశలో 70 గ్రామాలను రీ-సర్వేకు ఎంపిక చేశామని, వాటిలో సబ్బితం గ్రామం కూడా ఒకటని పేర్కొన్నారు. ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, అనంతరం ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులు, వ్యవసాయ భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక యంత్రాల సహాయంతో సర్వే చేస్తామని చెప్పారు. సర్వే అనంతరం భూ వివరాలను గ్రామాల్లో ప్రకటించి ప్రజలకు 21 రోజుల గడువు ఇచ్చి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 99 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని వెల్లడించారు.

రీ-సర్వే జరుగుతున్న సమయంలో రైతులు, భూయజమానులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి అధికారులకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. రోజుకు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే నిర్వహిస్తామని, ఏ భూములను సర్వే చేయనున్నారనే సమాచారాన్ని ముందుగానే తెలియజేస్తామని చెప్పారు. ఈ రీ-సర్వే ద్వారా రూపొందించే భూ వివరాలు రాబోయే 60 నుంచి 70 సంవత్సరాల వరకు ఉపయోగపడతాయని, ఆధార్ తరహాలో భూధార్ కార్డుల జారీకి ఇది కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజయ్య, సర్పంచ్ నూనె సరోజన, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ వేదికగా 12వ కార్మిక ఉపాధి మంత్రుల సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనున్న భారత్

న్యూ ఢిల్లీ, జులై 16:హైదరాబాద్ వేదికగా జూలై 15?16 తేదీలలో2026 బ్రిక్స్ కార్మిక, ఉపాధి మంత్రుల సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సమావేశానికి బ్రిక్స్ సభ్య దేశాల మంత్రులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. 2026లో భారతదేశ బ్రిక్స్ అధ్యక్షతన జరగనున్న కీలక మంత్రిత్వ స్థాయి కార్యక్రమాలలో ఇది ఒకటిగా నిలవనుంది.

భారతదేశ అధ్యక్షతన 'స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' (బిల్డింగ్ ఫర్ రెసిలియెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టైనబిలిటీ- (బ్రిక్స్) ఇతివృత్తంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్ర కార్మిక- ఉపాధి శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయా ఈ బ్రిక్స్ కార్మిక- ఉపాధి మంత్రుల సమావేశానికి (ఎల్ఈఎంఎం) అధ్యక్షత వహిస్తారు.2026 జూలై 13-14 తేదీలలో హైదరాబాద్‌లో జరుగుతోన్న మూడో బ్రిక్స్ ఎంప్లాయ్‌మెంట్ వర్కింగ్ గ్రూప్ (ఈడబ్ల్యూజీ) సమావేశం ముగిసిన అనంతరం ఈ ఎల్ఈఎంఎం సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ ఈడబ్ల్యూజీ సమావేశంలో సభ్య దేశాలు కింది నాలుగు ప్రాధాన్యత రంగాల్లో తమ అత్యుత్తమ విధానాలను, జాతీయ అనుభవాలను పంచుకున్నాయి:సామాజిక భద్రతా సంస్కరణలు, క్రమబద్ధీకరణ వ్యూహాల నుంచి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్లాట్‌ఫామ్-ఆధారిత పనుల కోసం సమ్మిళిత నమూనాల వరకు మంత్రులు ఈ నాలుగు ప్రాధాన్యత రంగాలపై చర్చించనున్నారు. వీటితో పాటు తమ జాతీయ అనుభవాల నుంచి అత్యుత్తమ విధానాలను, వినూత్న పద్ధతులను పరస్పరం పంచుకోనున్నారు. వర్కింగ్ గ్రూప్ ఒక ముసాయిదా ప్రకటనపై చర్చలను కూడా ముగించింది. దీనిని మంత్రుల పరిశీలన, ఆమోదం కోసం ఎల్ఈఎంఎం సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. వేగంగా మారుతున్న ఉపాధి రంగంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య ఉమ్మడి శ్రామిక మార్కెట్, ఉపాధి సవాళ్లపై నిరంతర సంప్రదింపులకు ఈ సమావేశం ఒక వేదికను అందిస్తుంది.

బ్రిక్స్ దేశాల వ్యాప్తంగా సమ్మిళిత, సుస్థిర, దృఢమైన వృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో సామాజిక రక్షణ, శ్రామిక శక్తి నైపుణ్యాభివృద్ధి, శ్రామిక మార్కెట్ విధానాలను బలోపేతం చేయడంపై ఈ చర్చలు ప్రధానంగా కేంద్రీకృతమవుతాయి. ఈ చర్చలు ఆచరణాత్మకమైన, ఇతర దేశాలు కూడా అనుకరించదగిన విధాన సాధనాలపై దృష్టి పెట్టనున్నాయి. మారుతున్న ఆర్థిక, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా బ్రిక్స్ దేశాల్లోని శ్రామిక మార్కెట్లు సమ్మిళితంగా, అనుకూలమైనవిగా, క్రియాశీలంగా మారే మార్గాలను గుర్తించే ఉద్దేశంతో ఇవి ఉన్నాయి. ఈ హైదరాబాద్ సమావేశం బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందని.. కార్మికులు, ఉపాధి, శ్రామికుల సంక్షేమంపై ఆచరణాత్మక, భవిష్యత్-ఆధారిత ఫలితాలకు దోహదం చేస్తుందని భావిస్తున్నారు. నిరంతర సంప్రదింపులు, విజ్ఞాన భాగస్వామ్యం ద్వారా గౌరవప్రదమైన ఉపాధికి మద్దతు ఇచ్చేలా, సామాజిక రక్షణను విస్తృతం చేసేలా, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేలా, భవిష్యత్తు పని రంగంలో ఎదురయ్యే అవకాశాలు- సవాళ్లకు శ్రామిక శక్తిని సంపూర్ణంగా సిద్ధం చేసేలా విధానాలను ముందుకు తీసుకెళ్లాలని బ్రిక్స్ దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

# హైదరాబాద్‌లో 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సదస్సును ప్రారంభించిన కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ




న్యూఢిల్లీ, జులై 16:కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈరోజు హైదరాబాద్‌లో '15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ (టియుఎఫ్) సదస్సు?2026'ను ప్రారంభించారు. సాంకేతిక పురోగతికి సామాజిక న్యాయం, బాధ్యతాయుతమైన ఆవిష్కరణలు, మానవ గౌరవం... మార్గనిర్దేశం చేయాలని, కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే అంతర్జాతీయ వ్యవస్థను నిర్మించాలని పిలుపునిచ్చారు.

ఈ ప్రారంభోత్సవంలో బ్రిక్స్ దేశాల నుంచి హాజరయిన ప్రతినిధులను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. భారత్ అధ్యక్షత వహిస్తున్న బ్రిక్స్ ఇతివృత్తం – "స్థిరత్వం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" గురించి వివరించారు. భవిష్యత్తులో ఉపాధి సమ్మిళితంగా, సమానత్వంతో కూడినదిగా, కార్మికుల సంక్షేమమే ప్రధానంగా ఉండేలా చూడటంలో దేశం ప్రదర్శిస్తున్న చిత్తశుద్ధిని ఈ ఇతివృత్తం ప్రతిబింబిస్తుందన్నారు.

బ్రిక్స్ దేశాల ప్రతినిధులకు డాక్టర్ మాండవీయ ఆహ్వానం పలికారు. కార్మికుల హక్కులను పరిరక్షించడంలోనూ, పారిశ్రామిక సామరస్యాన్ని బలోపేతం చేయడంలోనూ, ఆర్థిక పురోగతితో పాటు సామాజిక న్యాయం కలసి సాగేలా చేయడంలోనూ కార్మిక సంఘాలు కీలకమైన పాత్రను పోషించాయని మంత్రి అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సారథ్యంలో సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ దార్శనికతకు భారత్ కట్టుబడి ఉందని, దీనిలో సుస్థిరాభివృద్ధికి బలమైన ఆధారాలుగా ఆర్థిక వృద్ధి, కార్మిక సంక్షేమం ఉంటాయని తెలియజేశారు. ప్రభుత్వం చేపట్టిన కార్మిక సంస్కరణల గురించి మంత్రి వివరించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు సరళమైన లేబర్ కోడ్‌లుగా మార్చామని, అవి కార్మికుల హక్కులను మరింత బలోపేతం చేశాయని మంత్రి చెప్పారు. ఈ సంస్కరణల ద్వారా కనీస వేతనాలు, నియామక పత్రాలు, మెరుగైన వృత్తి భద్రత, ఆరోగ్యం, డిజిటల్ అమలు వ్యవస్థలను అందరికీ అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా మొదటిసారి గిగ్, ప్లాట్‌ఫామ్ శ్రామికులకు అధికారిక గుర్తింపునిచ్చాయి.

కార్మిక విధానాలను మార్చడానికి డిజిటల్ మౌలిక వసతులను భారత్ సద్వినియోగం చేసుకుందని డాక్టర్ మాండవీయ అన్నారు. 'ఈ-శ్రామ్' పోర్టల్లో 317 మిలియన్ల మంది అసంఘటిత కార్మికులు నమోదు చేసుకున్నారని ఆయన వెల్లడించారు. తద్వారా వారికి వివిధ సంక్షేమ పథకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఉద్యోగార్థులు, సంస్థలు, కెరీర్ సెంటర్లు, శిక్షణ సంస్థలను జాతీయ స్థాయి డిజిటల్ ఉపాధి వేదిక అయిన నేషన్ కెరీర్ సర్వీస్ పోర్టల్ అనుసంధానించిందని చెప్పారు. జాతీయ సామాజిక భద్రత వ్యవస్థ గురించి కూడా మంత్రి వివరించారు. ప్రపంచంలోనే అతి పెద్ద సామాజిక భద్రత సంస్థల్లో ఒకటైన ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో)లో 80 మిలియన్ల మంది క్రియాశీలక సభ్యులు, 8 మిలియన్ల మంది పింఛనుదారులు ఉన్నారని మంత్రి తెలియజేశారు. అలాగే 150 మిలియన్ల మంది బీమాదారులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సేవలను, సామాజిక భద్రతా ప్రయోజనాలను కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) అందిస్తుంది. ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐసీల్లో నిరంతరం చేపడుతున్న సంస్కరణల వల్ల కవరేజీ విస్తృతి పెరిగిందని, విధాన ప్రక్రియలు సరళీకృతమయ్యాయని, సేవలు మెరుగయ్యాయని ఆయన వెల్లడించారు.

భారత్‌లో సామాజిక భద్రత పరిధిలోకి వచ్చే వారి సంఖ్య 2015లో 19 శాతం మాత్రమే ఉండగా.. 2025 నాటికి దేశంలో 94 కోట్ల మందితో అది 64.3 శాతానికి పెరిగిందని మంత్రి తెలిపారు. ఈ సంఖ్య వంద కోట్లకు చేరినట్టు 2026 ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయన్నారు. ఉద్యోగ కల్పనపై మాట్లాడుతూ.. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం దాదాపు 170 మిలియన్ల ఉపాధి అవకాశాలను కల్పించిందని డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ అన్నారు. 'ఉద్యోగావకాశాలను బట్టి ప్రోత్సాహకాల' విధానం ద్వారా.. వచ్చే రెండేళ్లలో వ్యవస్థీకృత రంగంలో 35 మిలియన్ల ఉద్యోగాలను సృష్టించాలని ప్రధానమంత్రి వికసిత భారత్ రోజ్‌గార్ యోజన లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

ప్రభుత్వం, యాజమాన్యాలు, కార్మిక సంఘాల మధ్య త్రైపాక్షిక చర్చల ఆధారంగా దేశ కార్మిక పరిపాలన విధానాన్ని రూపొందించినట్టు డాక్టర్ మన్సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐసీ వంటి సంస్థలూ, కార్మిక చట్టాల పరిధిలోని చట్టబద్ధ సంస్థలూ త్రైపాక్షిక యంత్రాంగం ద్వారా కార్యకలాపాలను నిర్వహిస్తాయని, కార్మిక వ్యవహారాల నిర్వహణలో అన్ని వర్గాల ప్రాతినిధ్యం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని వివరించారు.

దాదాపు సగం ప్రపంచ జనాభాకు బ్రిక్స్ దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, ప్రపంచంలో అతిపెద్ద కార్మిక శక్తుల్లో ఒకటిగా బ్రిక్స్ ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. సామాజిక భద్రత, కార్మికుల రాకపోకలు, నైపుణ్యాభివృద్ధి, ఏఐ పాలన, గౌరవప్రదమైన పని వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడానికి గణనీయమైన అవకాశాలు న్నాయన్నారు. త్వరలో నిర్వహించనున్న బ్రిక్స్ దేశాల కార్మిక, ఉపాధి శాఖ మంత్రుల సమావేశానికి.. ఈ వేదిక చేసే సిఫార్సులు ఎంతో దోహదపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

అంతకుముందు బ్రిక్స్ కార్మిక సంఘాల ఫోరం సదస్సు – 2026 చైర్మన్, భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ అధ్యక్షుడు శ్రీ సుంకరి మల్లేశం మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమాన్ని పెంపొందించడానికి, సమ్మిళిత అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడమే ఈ సదస్సు లక్ష్యమన్నారు. బీఎంఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, బ్రిక్స్ కార్మిక సంఘాల ఫోరం ముఖ్య సంధానకర్త శ్రీ బి. సురేంద్రన్ ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ చర్చలు అర్థవంతమైన ఫలితాలనిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

బ్రిక్స్ దేశాల ప్రతినిధులు శ్రీ కార్లస్ అగస్టో ముల్లర్ (బ్రెజిల్), రష్యా స్వతంత్ర కార్మిక సంఘాల సమాఖ్య (ఎఫ్ఎన్‌పీఆర్) చైర్మన్ శ్రీ సెర్గీ చెర్నోగాయేవ్, శ్రీ హుజియాంగ్ ఝూ (చైనా), శ్రీ మసలే గాడ్‌ఫ్రే సెలెమత్సేలా (దక్షిణాఫ్రికా), ఐఎల్‌వో–న్యూఢిల్లీ కార్మిక వ్యవహారాల నిపుణురాలు శ్రీమతి యూకీ ఒట్సుజీ, జస్టిస్ (విశ్రాంత) ఎన్. నగరేశ్ ప్రారంభ సదస్సులో పాల్గొన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నిర్వహించిన ఈ మూడు రోజుల సదస్సు.. 50కి పైగా అంతర్జాతీయ ప్రతినిధులు, భారతీయ కార్మిక సంఘాలకు చెందిన దాదాపు 70 మంది ప్రతినిధులు, కార్మిక వ్యవహారాల నిపుణులు, విద్యావేత్తలను ఒకే వేదికపై చేర్చింది. సార్వత్రిక సామాజిక భద్రత – అందరికీ ప్రయోజనాల వర్తింపు, సమాజ హిత సాంకేతికత – బాధ్యతాయుత ఏఐ, భవిష్యత్ ఉపాధి అవకాశాల దిశగా నైపుణ్యాభివృద్ధి, మారుతున్న పని వ్యవస్థలో మహిళలు అనే నాలుగు ప్రత్యేక ఇతివృత్తాలపై మిగతా రెండు రోజుల్లో ఈ చర్చల్లో ప్రధానంగా దృష్టి సారిస్తారు.

## కొలువుదీరిన వలిగొండ పీఏసీఎస్ నూతన పాలకవర్గం

నల్గొండ, జులై 16:వలిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించింది. చైర్మన్‌గా గరిసె రవి, వైస్ చైర్మన్‌గా జక్కా జంగారెడ్డి బాధ్యతలు చేపట్టారు. అలాగే డైరెక్టర్లుగా బత్తిని లింగమ్మ, ఎమ్మె మల్లేశం, బూడిద పద్మ, కట్ట లింగస్వామి, గూడూరు మోహన్‌రెడ్డి, వనగంటి జహంగీర్, బుగ్గ బీరప్ప, కలకూరి చంద్రయ్య, బర్ల నర్సింహ, బంగారి మహిపాల్, వనం నర్సింహ బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా చైర్మన్ గరిసె రవి మాట్లాడుతూ, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం, సహకార సంఘ అభివృద్ధే లక్ష్యంగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.నూతన పాలకవర్గ సభ్యులకు వలిగొండ ప్రాంత ప్రజాప్రతినిధులు, సహకార సంఘ సభ్యులు, రైతులు శుభాకాంక్షలు తెలియజేశా రు. వారి పదవీకాలం విజయవంతంగా సాగి రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## పరిసరాల పరిశుభ్రతను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



నల్గొండ, జులై 16: మిర్యాలగూడ పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజారెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని 34, 35 వార్డుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించారు. స్వచ్ఛ మిర్యాలగూడ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలకృష్ణ, కౌన్సిలర్లు దైద సోముసుందర్, దైద స్వప్న, ఆర్కే, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై ఈనెల 20న చౌటుప్పల్‌లో సీపీఎం ప్రాంతీయ సదస్సు




నల్గొండ, జులై 16: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ ప్రజల్లో భయాందోళనలు, గందరగోళాన్ని సృష్టిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. ఈ ప్రక్రియ కారణంగా లక్షలాది మంది ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడా దీని ప్రభావం కనిపించిందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, దాని ప్రభావం, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 20న చౌటుప్పల్‌లో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చౌటుప్పల్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 20వ తేదీ ఉదయం 10:30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ముఖ్య వక్తగా, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును పరిరక్షించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ప్రాంతీయ సదస్సుకు ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎండి జహంగీర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, బూరుగు కృష్ణారెడ్డి, గుంటూరు శ్రీనివాసాచారి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గోశిక కరుణాకర్, రాగిరి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 3 వరకు ఎస్ఐఆర్ నమోదు..

### –ప్రతి అర్హ ఓటరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మహబూబ్‌నగర్, జులై 16:భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియకు గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో ప్రతి అర్హ ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఊట్కూర్ తహసీల్దార్ అశోక్ కుమార్ సూచించారు.

గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని కొల్లూరు, ఊట్కూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. నమోదు కేంద్రాలను సందర్శించి దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే లక్ష్యంతో ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. గడువు ఆగస్టు 3 వరకు పొడిగించబడినందున ఇప్పటి వరకు నమోదు చేసుకోని అర్హులైన ఓటర్లు తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) లేదా రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.ప్రతి అర్హ పౌరుడు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని, అందరూ బాధ్యతగా ఎస్ఐఆర్ నమోదును పూర్తి చేయాలని తహసీల్దార్ పిలుపు నిచ్చారు. అధికారులు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేగవంతంగా సేవలు అందించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో కొల్లూరు సర్పంచ్ ఎం. రేణుక భరత్, ఊట్కూర్ సర్పంచ్ సువర్ణ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ చింతా రవి, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రరెడ్డి, ఆర్ఐలు కృష్ణారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం



నిజామాబాద్, జులై 16:వర్షాకాలం ప్రారంభమై దాదాపు నెలరోజులు గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలం బాచన్‌పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ వెన్నెల బాలమణి (జనార్ధన్) ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం హనుమాన్ ఆలయంలోని శివలింగం, నందికి జలాభిషేకం నిర్వహించి సకాలంలో వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు బిందెలతో ఆలయానికి చేరుకుని సామూహికంగా అభిషేకంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వర్షాభావంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందన్నారు. భగవంతుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూ భారతి రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి..

నిజామాబాద్, జులై 16:నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామంలో భూ భారతి కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక సర్వే బృందం బుధవారం రీ–సర్వే నిర్వహించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూముల హద్దులు, రికార్డుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సర్వే చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ ఎంఏ. సమీర్ తెలిపారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, భూ భారతి రీ–సర్వే ద్వారా భూముల రికార్డుల్లో పారదర్శకత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. భూమి యజమానులు తమ వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్‌లు, ఇతర భూ సంబంధిత పత్రాలతో సర్వే సమయంలో తప్పనిసరిగా హాజరై అధికారులకు సహకరించాలని సూచించారు. రీ–సర్వేపై ఎలాంటి అపోహాలు పెట్టుకోకుండా ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సర్వే బృందం అధికారులు, పంచాయతీ కార్యదర్శి సంతోష్, రెవెన్యూ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, మైనార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కీలక, వ్యూహాత్మక ఖనిజ బ్లాకుల ఎనిమిదో విడత వేలాన్ని ప్రారంభించనున్న కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ

న్యూ ఢిల్లీ, జులై 16: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, బొగ్గు, గనుల శాఖ సహాయమంత్రి శ్రీ సతీశ్ చంద్ర దూబేతో పాటు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు కలిసి వ్యూహాత్మక, కీలక ఖనిజాల బ్లాకుల వేలం ఎనిమిదో విడతను ప్రారంభిస్తారు.

ఎనిమిదో విడత ద్వారా 9 రాష్ట్రాల్లో విస్తరించిన 20 కీలక, వ్యూహాత్మక ఖనిజ బ్లాకులను చేర్చారు. వీటిలో కొత్తగా గుర్తించిన 13 బ్లాకులు, రెండోసారి వేలం వేస్తున్న 7 బ్లాకులు ఉన్నాయి. మాలిబ్డినం, గ్రాఫైట్, గ్లకోనైట్, అరుదైన మృత్తికా మూలకాలు (ఆర్ఈఈ), వెనెడియం, గాలియం, టైటానియం, టంగ్‌స్టన్, పాస్ఫరైట్, పొటాష్, లిథియం, సి?సియం, రుబీడియం వంటివి ఈ ఖనిజాల జాబితాలో ఉన్నాయి. ఇవి స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగం, ఎరువులు, రక్షణ, ఇతర వ్యూహాత్మక రంగాలకు కీలకమైనవి.

ఏడు విడతల్లో వేలం ప్రక్రియ విజయవంతంగా పూర్తవటంతో, వేలం కోసం చేపట్టిన 88 కీలక, వ్యూహాత్మక ఖనిజ బ్లాకుల్లో 56 బ్లాకులను గనుల మంత్రిత్వ శాఖ విజయవంతంగా విక్రయించింది. దీని ద్వారా విజయాల రేటు 63 శాతానికి పైగా నమోదైంది. వరుసగా జరిగిన వేలం రౌండ్లలో పరిశ్రమల నుంచి లభించిన బలమైన స్పందన.. ప్రభుత్వ పారదర్శక, పోటీతత్వ, మార్కెట్ ఆధారిత వేలం విధానంపై పెట్టుబడిదారుల్లో పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ఆర్థిక వృద్ధి, సాంకేతిక పురోగతి, స్వచ్ఛ ఇందన పరివర్తనకు కీలక ఖనిజ వనరులను భద్రపరచుకోవటంలో భారతదేశ ప్రయత్నాలకు ఇది మరింత బలాన్ని చేకూరుస్తోంది.

వేలం విధానం ప్రారంభమైనప్పటి నుంచి 20205-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 212 ఖనిజ బ్లాకులను విజయవంతంగా వేలం వేయటం ద్వారా ఖనిజ రంగం కీలక ఘట్టాన్ని నమోదు చేసింది. ఇందులో 22 కీలక, వ్యూహాత్మక ఖనిజ బ్లాకులు కూడా ఉన్నాయి. భారతదేశ ఆర్థిక వృద్ధి, సాంకేతిక పురోగతి, స్వచ్ఛ ఇంధన పరివర్తనకు అత్యంత అవసరమైన కీలక ఖనిజ వనరులను భద్రపరచటంలో ప్రభుత్వానికున్న నిబద్ధతను ఇది స్పష్టం చేస్తోంది.

వేలం ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఇటీవల ఖనిజాల (వేలం) నియమాలు–2026 సవరణలను ప్రకటించింది. ఈ సంస్కరణలు ముందస్తు మొత్తాన్ని చెల్లించే సమయ పరిమితిని మరింత సులభతరం చేశాయి. గనులను లీజుకివ్వటం, అన్వేషణ లైసెన్స్ ఒప్పందాల అమలులో మరింత సౌలభ్యాన్ని కల్పిస్తాయి. బిడ్డర్ల తప్పిదం కాకుండా ఇతర కారణాల వల్ల వేలం రద్దయితే... బిడ్ సెక్యూరిటీ, పర్ఫార్మెన్స్ సెక్యూరిటీ, ఇతర చెల్లింపులను సకాలంలో తిరిగి చెల్లించేందుకు ఇవి వీలు కల్పిస్తాయి.

# వర్షాల కోసం శివలింగానికి జలాభిషేకం

మహబూబ్‌నగర్, జులై 16:వర్షాకాలం ప్రారంభమై దాదాపు నెలరోజులు గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

ఈ నేపథ్యంలో మోమిన్‌పేట్ మండలం కోల్కొంద గ్రామంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి, గ్రామ సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ ఆధ్వర్యం లో గ్రామస్తులు గురువారం హనుమాన్ ఆలయంలోని శివలింగం, నందికి జలాభిషేకం నిర్వహించి సకాలంలో వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు బిందెలతో ఆలయానికి చేరుకుని సామూహికంగా అభిషేకంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ మాట్లాడుతూ, వర్షాభావంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందన్నారు.

భగవంతుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని ప్రార్థించినట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రచారకులుగా మారాలని విద్యార్థులకు పిలుపునిచ్చిన శ్రీ సురేష్ గోపి



న్యూఢిల్లీ, జులై 16:పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ప్రచారకులుగా మారాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి శ్రీ సురేష్ గోపి ఈ రోజు పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది కేవలం ఒక ఉద్యమం మాత్రమే కాదని అది వ్యక్తిగత బాధ్యత, 'జన్ భాగీదారి' (ప్రజా భాగస్వామ్యం)తో ముడిపడి ఉన్న ఒక సంస్కృతి అని ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) సంయుక్తంగా నిర్వహించిన స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు.

శ్రీ నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి నాయకత్వంలో 'స్వచ్ఛ భారత్ మిషన్' పరిశుభ్రతను ఒక దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా మార్చిందని శ్రీ సురేష్ గోపి అన్నారు. ప్రతి శుభ్రమైన తరగతి గది, చెత్త లేని వీధి, పచ్చని ప్రాంగణం బాధ్యతాయుతమైన ప్రజల వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందన్న ఆయన... ఇది దేశ నిర్మాణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

'తల్లి పేరు మీద ఒక చెట్టు' (ఏక్ పేడ్ మా కే నామ్)' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతి మొక్కను సంరక్షించాలని ఆయన కోరారు. భావితరాలకు మనం అందించగలిగే గొప్ప బహువతుల్లో వృక్షాలు ముఖ్యమైనవని అన్నారు. అవి స్వచ్ఛమైన గాలి, నీడ, జీవవైవిధ్యం, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని ఆయన అన్నారు. ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని... తద్వారా పచ్చని తెలంగాణ, హరిత భారతదేశ నిర్మాణానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

భారతదేశ ఇంధన భద్రతను నిర్ధారించడమే కాకుండా సుస్థిరాభివృద్ధి, సామాజిక సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి కూడా పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లతో (హెచ్‌పీసీఎల్) పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, నయారా ఎనర్జీల సంయుక్త ప్రయత్నాలను ఆయన అభినందించారు. తమ ప్రధాన బాధ్యతలకు అతీతంగా దేశ నిర్మాణం పట్ల ఇంధన రంగ సంస్థలు చూపే నిబద్ధతను ఇటువంటి కార్యక్రమాలు తెలియజేస్తాయని ఆయన అన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ, కరుణ, చిత్తశుద్ధి, ప్రకృతి పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలని శ్రీ సురేష్ గోపి కోరారు. ప్రతిభ అనేది కేవలం విద్యాపరమైన ప్రదర్శనలోనే కాకుండా బాధ్యతాయుతమైన పౌరుడిలో కూడా ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. తరగతి గదులను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు-విద్యుత్‌ను ఆదా చేయాలని, ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని, ప్రజల ఆస్తులను కాపాడాలని, పర్యావరణ పరిరక్షణ కోసం చురుకుగా సహకరించాలని ఆయన విద్యార్థులను విన్నవించారు.

'వికసిత్ భారత్- 2047' సంకల్పం గురించి మాట్లాడుతూ.. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, విద్య, సామాజిక బాధ్యతను నిర్ధారించడంలో ప్రతి పౌరుడికి ఒక పాత్ర ఉందని కేంద్ర మంత్రి అన్నారు. స్వచ్ఛత స్ఫూర్తిని జీవితకాల నిబద్ధతగా మార్చుకోవాలని... స్వచ్ఛమైన, పచ్చని, ఆరోగ్యకరమైన, మరింత మానవత్వంతో కూడిన భారత్‌ను నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) కార్యనిర్వాహక డైరెక్టర్ - రాష్ట్ర హెడ్ (తెలంగాణ & ఆంధ్రప్రదేశ్) శ్రీ పీయూష్ మిట్టల్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) జనరల్ మేనేజర్ శ్రీ సుశీల్ కుమార్ రాయ్, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ సురేష్ గోపి... 'తల్లి పేరు మీద ఒక చెట్టు' కార్యక్రమం కింద ఒక మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని పాఠశాల ప్రాంగణం నుంచి వారి ఇళ్లకు, సమాజానికి తీసుకువెళ్లేలా విద్యార్థులను ప్రోత్సహించిన ఆయన.. వాళ్లకు మొక్కలను పంపిణీ చేశారు.

## శ్రీ పెద్దమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రూ.1,01,016 విరాళం



మెదక్, జులై 16: మండల కేంద్రంలోని శ్రీ వనదుర్గ పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి సదాశివనగర్ గ్రామానికి చెందిన పోలాబోయిన స్వప్న?బాలగంగారం దంపతులు గురువారం రూ.1,01,016 విరాళాన్ని అందజేశారు. ఆలయంలో ప్రతిష్ఠించనున్న శ్రీ కృష్ణార్జున రథం నిర్మాణానికి ఈ విరాళాన్ని వినియోగించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి కోసం భక్తులు స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు పోలాబోయిన పెంటవ్వ, పోలాబోయిన అనిత?రాములు, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సదరం కేంద్రం ప్రారంభం

నిజామాబాద్, జులై 16:దివ్యాంగుల సౌకర్యార్థం బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని సదరం కేంద్రంలో సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ విజయ భాస్కర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రస్తుతం నెలకు రెండుసార్లు సదరం సేవలు అందిస్తారని తెలిపారు. ఇప్పుడు అంగవైకల్యం, పక్షవాత రోగులకు సదరంలో సేవలు అందుతాయని పేర్కొన్నారు.


భవిష్యత్‌లో మరిన్నీ సేవలను విస్తరిస్తామని చెప్పారు. బాన్సువాడ సుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో 15 మంది కి 13 మంది హాజరై వైకల్య పరీక్షలు నిర్వహించుకున్నారు. వైద్యులు ప్రవీణ్, సాయిలు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్, ఆర్ఎంవో సుజాత, ఉద్యోగులు అమృత, సురేష్, సంధ్య, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా అందజేయాలి కలెక్టర్ ఇలా త్రిపాఠి

కామారెడ్డి, జులై 16: (నేటినిజం ప్రతినిధి) 'సర్' గడువు ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారా(ఈఎఫ్)లను భర్తీ చేసి త్వరగా బీఎల్వోలకు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. పూర్తి వివరాలు డిజిటలైజేషన్ చేయాల్సి ఉంటుందని, వలసపోయిన, మరణించిన వారి పేర్లు తొలగించి, ఓటర్ల జాబితాను రూ పొజ=, ఆఖరు వరకు వేచి చూడకుండా వెంటనే ఈఎఫ్‌లను వెంటదివెంటనే అందజేయాలని పేర్కొన్నారు. ఈఎఫ్‌లు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఓటరు జాబి తా నుంచి పేరు గల్లంతవుతుందని స్పష్టం చేశారు. ఎవరికైనా 2002 ఎస్ఐఆర్ వివరా లు తెలియకపోతే సర్కిల్ వారీగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను లేదా బీఎల్వోలను సం ప్రదించాలని సూచించారు. అయినప్పటికీ వివరాలు తెలియని పక్షంలో ప్రస్తుత ఓటరు జాబితా వివరాలు పొందుపర్చి ఫారం సమర్పించవచ్చని పేర్కొన్నారు. అలాంటి వారి పేరు కూడా ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని తెలిపారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు కూడా క్షేత్రస్థాయిలో ఉంటూ ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతమయ్యేలా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. జాబితాను పక్కాగా రూపొందించి, వాటిపై బీఎల్ఏల సంతకాలు తీసుకోవాలని సూచించారు.

## గ్రేవ్ కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టాలి..

### -కమ్యూనిటీ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని సూచన



సంగారెడ్డి, జులై 16: (నేటినిజం ప్రతినిధి):వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ బుధవారం పటాన్‌చెరు సబ్ డివిజనల్ పోలీసు అధికారి (డీఎస్పీ) కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్‌తో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్క నాటిన ఎస్పీ, అనంతరం కార్యాలయ రికార్డులు, దర్యాప్తులో ఉన్న కీలక కేసులను పరిశీలించి వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, అత్యాచారం, డౌరీ డెత్ వంటి గ్రేవ్ కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి సూచించారు. ప్రతి కేసులో చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని ఆదేశించారు. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న పటాన్‌చెరు సబ్ డివిజన్‌లో ఉద్యోగులు, కార్మికుల రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుందని, పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో వలస కార్మికుల సంఖ్య కూడా అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఆస్తి సంబంధిత నేరాలపై ప్రత్యేక నిఘా అవసరమని పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను క్రమం తప్పకుండా నిర్వహించడంతో పాటు, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి పగలు, రాత్రి బీట్‌లను బలోపేతం చేసేలా సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌హెచ్‌వోలకు తగిన సూచనలు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలపై నిఘా పెంచాలని సూచించారు. ప్రజలకు చేరువగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని, గ్రామాల్లో నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నేరాల నివారణ, నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ ప్రజల్లో వాటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించి గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ పెండింగ్ కేసుల పరిష్కారంపై ఎస్‌హెచ్‌వోలకు మార్గనిర్దేశం చేయాలని, తనిఖీ నివేదికలను సకాలంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. ప్రతి రికార్డు సీసీటీఎన్ఎస్‌లో నమోదు అయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు.

# 'భారత్ టెక్స్-2026'కు శ్రీకారం చుట్టిన కేంద్ర జౌళిశాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్



న్యూఢిల్లీ, జులై 16:భారత ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ జౌళి వేడుక భారత్ టెక్స్-2026ను కేంద్ర జౌళిశాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ ఇవాళ న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభించారు. తద్వారా రికార్డు స్థాయి అంతర్జాతీయ భాగస్వామ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత జౌళి విలువ శ్రేణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ సహకారంతో 'భారత్ టెక్స్ ట్రేడ్ ఫెడరేషన్' (బీటీటీఎఫ్) ఆధ్వర్యాన సాగే ఈ కార్యక్రమంలో 130కి పైగా దేశాలు పాల్గొంటున్నాయి. దీంతో 6,000 మందికి పైగా కొనుగోలుదారులు, 1.3 లక్షల మందికిపైగా వాణిజ్య సందర్శకులు ఒకే వేదికపైకి వచ్చారు. మొత్తం 1.6 మిలియన్ చదరపు టడుగుల ప్రాంగణంలో 20,000కు పైగా వస్త్ర ఉత్పత్తులను ఇందులో ప్రదర్శిస్తున్నారు. పటిష్ట, సుస్థిర, వినూత్న ఆవిష్కరణలతో పురోగమించే జౌళి విలువ శ్రేణిలో ఒక విశ్వసనీయ ప్రపంచ వనరుల కూడలిగా, వ్యూహాత్మక భాగస్వామిగా భారత్ ఆవిర్భావాన్ని ఈ కార్యక్రమం పునరుద్ఘాటిస్తోంది.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర జౌళిశాఖ సహాయ మంత్రి శ్రీ పవిత్ర మార్గరిటా సహా ఆ శాఖ కార్యదర్శి శ్రీమతి నీలం షమీ రావు, ఇతర ఉన్నతాధికారులు, భారత్ టెక్స్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ శ్రీ నరేన్ గోయెంకా, కో-ఛైర్మన్ శ్రీ భద్రేష్ దోధియా, భాగస్వామ్య దేశాల మంత్రులు, అధికారులు, ప్రపంచవ్యాప్త కొనుగోలుదారులు, సోర్సింగ్ అధిపతులు, పారిశ్రామికవేత్తలు, ఎగుమతిదారులు, పెట్టుబడిదారులు, అంతర్జాతీయ వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

రష్యన్ ఫెడరేషన్ వ్యవసాయ మంత్రి తిమూర్ గవేవ్ నేతృత్వంలో ఆ దేశ మంత్రుల బృందం, న్యూజిలాండ్ వ్యవసాయ శాఖ సహాయ మంత్రి-గ్రామీణ సమాజాల మంత్రి మార్క్ ప్యాటర్సన్ నేతృత్వాన హై కమిషనర్ సహా మంత్రుల బృందాలు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యాయి. అంతర్జాతీయంగా భారత్ టెక్స్‌కు ఇనుమడిస్తున్న ప్రాధాన్యాన్ని వీరందరి హాజరు ప్రతిబింబిస్తోంది. ప్రపంచ వాణిజ్య, విధాన చర్చలకు భారత్ ఒక వేదికగా ఆవిర్భవించడంలో ఈ కార్యక్రమం తనవంతు పాత్ర పోషిస్తోంది.

ఎనిమిది ప్రాయోజిత రాష్ట్రాలు మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక. తమిళనాడు సహా 9 భాగస్వామ్య రాష్ట్రాలు.. ఆంధ్రప్రదేశ్, అస్సాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, జమ్మూకాశ్మీర్, ఒడిషా, మణిపూర్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ సహా కేంద్రపాలిత ప్రాంతాలు కూడా తమ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అవకాశాలు, విధానపరమైన మద్దతును ప్రదర్శించడం ద్వారా ఈ కార్యక్రమ వాస్తవిక జాతీయ స్వభావం నిరూపితమైంది.

ఈ కార్యక్రమానికి పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ భగవంత్ మాన్, బీహార్ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీమతి శ్రేయసి సింగ్, అలాగే, తమిళనాడు నుంచి చేనేత-వస్త్ర-ఖాదీ శాఖ మంత్రి శ్రీ ఎం.విజయ బాలాజీ, పరిశ్రమలు-పెట్టుబడుల ప్రోత్సాహం-వాణిజ్య శాఖ మంత్రి శ్రీమతి సెల్వి ఎస్.కీర్తన కూడా హాజరయ్యారు.

కేంద్ర-రాష్ట్ర పారిశ్రామిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడం కోసం ఈ కార్యక్రమంలో గుజరాత్, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, పంజాబ్, బీహార్, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల కోసం ప్రత్యేక 'స్టేట్ ఇన్వెస్టర్ కనెక్ట్ సెషన్లు' నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విధానపరమైన మద్దతును క్షేత్రస్థాయిలో పెట్టుబడులుగా రూపొందించే దిశగా గుజరాత్, ఉత్తర ప్రదేశ్‌ల కోసం ప్రత్యేకంగా 'పీఎం మిత్ర మాస్టర్ డెవలపర్ సెషన్' కూడా ఏర్పాటు చేశారు.

ప్రారంభ వేదిక కార్యక్రమంతో పాటు 'భారత్ టెక్స్-2026'లో వివిధ అంశాలపై నిర్వహించే కార్యకలాపాల్లో 20కి పైగా దేశాల అంతర్జాతీయ నిపుణులు, పారిశ్రామికవేత్తలు 'సీఎక్స్ఓ'లు, విధాన రూపకర్తలు, మేధావులు సహా 350 మందికి పైగా వక్తలు పాల్గొంటున్నారు. వీరి మధ్య ఫలితాధారిత చర్చల దిశగా సమన్వయం కోసం ఒక ప్రత్యేక అంతర్జాతీయ పెవిలియన్ కూడా ఏర్పాటైంది. నాలుగు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో అమెరికా, జపాన్, స్పెయిన్, యునైటెడ్ కింగ్‌డమ్, పోర్చుగల్, రష్యా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, యూఏఈ, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్ తదితర దేశాల పారిశ్రామిక-వాణిజ్య ప్రతినిధి బృందాలు పాల్గొంటాయి. వారి మధ్య ప్రత్యేక ద్వైపాక్షిక సమావేశాలలో భారత్-అమెరికా పత్తి భాగస్వామ్యం, భారత్-న్యూజిలాండ్ ఉన్ని వ్యవస్థ, భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలు, జపాన్ ప్రతినిధి బృందం ప్రత్యేక సమావేశం, రష్యాపై దృష్టి సారిస్తూ జౌళి రంగ చర్చలు వంటివి ఉంటాయి.

భారతీయ జౌళి పరిశ్రమ సంపూర్ణ స్వరూపాన్ని 'భారత్ టెక్స్-2026' ఆవిష్కరిస్తుంది. ఫైబర్లు, నూలు, వస్త్రాలు, దుస్తులు, ఫ్యాషన్, గృహ వస్త్రాలు, సాంకేతిక వస్త్రాలు, చేనేత, హస్తకళలు, యంత్రాలు సహా అనుబంధ పరిశ్రమల నుంచి వేలాది వాణిజ్య ప్రదర్శన సంస్థల వారు ఇందులో పాల్గొంటారు. వీరితోపాటు తిరుపూర్, ఇచల్కరంజి, అహ్మదాబాద్ వంటి ప్రసిద్ధ వస్త్ర సముదాయాల ప్రతినిధులు కూడా హాజరవుతారు. అమెరికా, ఇంగ్లండ్, జపాన్, పోర్చుగల్, స్పెయిన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా, నేపాల్ సహా 14 దేశాల ప్రదర్శన సంస్థలు పాలుపంచుకుంటాయి. అలాగే, ఐక్యరాజ్యసమితి, ఐరోపా యూనియన్ నుంచి సంస్థాగత ప్రతినిధులు సహా దేశీయంగా ట్రైడెంట్, వర్ధమాన్ టెక్స్‌టైల్స్, ఆర్ఎస్‌డబ్ల్యూఎం, షాహి ఎక్స్‌పోర్ట్స్, కలర్‌జెట్, అరవింద్, పీడీపీఎస్ లిమిటెడ్, సత్వా వంటి కీలక పారిశ్రామిక ప్రాయోజిత సంస్థలు కూడా భాగస్వాములు అవుతున్నాయి. ఈ విధంగా నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమం ప్రపంచ వస్త్ర విలువ శ్రేణిలోని భాగస్వాములను ఒకేచోటకు చేరుస్తుంది. వారి మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, విధాన చర్చలు సహా అంతర్జాతీయ వాణిజ్య భాగస్వామ్యాల దిశగా చర్చలకు ఒక సమగ్ర వేదికగా ఉపయోగపడుతుంది.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కేంద్ర మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ ప్రసంగిస్తూ- 'భారత్ టెక్స్'ను ప్రారంభించాక ఇది మూడో సంవత్సరమని గుర్తుచేశారు. ఈ మూడేళ్లలోనే వాణిజ్యం, పెట్టుబడి, ఆవిష్కరణ, విధాన చర్చలకు ఇది అంతర్జాతీయ గుర్తింపు పొందిన వేదికగా రూపొందిందని ఆయన పేర్కొన్నారు. భారత్ ఉత్పాదక శక్తి, విధాన వ్యవస్థ, దీర్ఘకాలిక వృద్ధి సామర్థ్యంపై ప్రపంచ వస్త్ర పరిశ్రమకుగల విశ్వాసాన్ని ఇది స్పష్టం చేస్తున్నదని చెప్పారు. ప్రధానమంత్రి నిర్దేశిత '5ఎఫ్' సూత్రం 'ఫార్మ్ టు ఫైబర్ టు ఫ్యాక్టరీ టు ఫ్యాషన్ టు ఫారిన్' గురించి మాట్లాడుతూ- ఆయన దార్శనికతకు అనుగుణంగా భారతీయ సంస్థలను ప్రపంచ మార్కెట్లతో సంధానించే శక్తిమంతమైన వేదికగా 'భారత్ టెక్స్' మారిందన్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ వస్త్ర శ్రేణిలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తున్నదని వివరించారు.

ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయి నానాటికి ఇనుమడిస్తున్న నేపథ్యంలో నేటి ప్రారంభోత్సవం సందర్భంగా ప్రపంచ ప్రసిద్ధ వస్త్ర-ఫ్యాషన్ సోర్సింగ్ వేదికలలో ఒకటైన 'ప్రీమియర్ విజన్-ప్యారిస్', 'బీటీటీఎఫ్'ల ఒక ఆసక్తి వ్యక్తీకరణ ఒడంబడిక (ఐఓఎల్) కూడా కుదిరింది. ఈ మేరకు మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ సమక్షంలో ఆ ప్యారిస్ సంస్థ ప్రతినిధి ఫ్యాషన్ డివిజన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీమతి ఫ్లోరెన్స్ రౌసన్, బీటీటీఎఫ్ ఛైర్మన్ శ్రీ నరేన్ గోయెంకా దీనిపై సంతకాలు చేశారు. ఆవిష్కరణ, సుస్థిరత, డిజైన్ నైపుణ్యం, ట్రెండ్ ఇంటెలిజెన్స్, కొనుగోలుదారు-విక్రేతల అనుసంధానం, ప్రపంచ మార్కెట్ ప్రవేశం వంటి రంగాల్లో భారత్-ఐరోపా సహకారాన్ని మరింత విస్తరించే దిశగా ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ఓ కీలక మలుపు. భారత 'ఎంఎస్ ఎంఈ'లు, తయారీదారులు, ఎగుమతిదారులు, డిజైనర్లు ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్లు, ఫ్యాషన్ సంస్థలతో కలిసి కృషి చేసే దిశగా ఇది కొత్త అవకాశాలను సృష్టిస్తుంది.

ఈ భాగస్వామ్యం మూడు రంగాల్లో ఒక చట్రాన్ని ఏర్పరుస్తుంది. ఈ మేరకు భారత్ టెక్స్-ప్రీమియర్ విజన్-ప్యారిస్ మధ్య ఒక ప్రదర్శన భాగస్వామ్యం, ఐరోపా సహా ప్రపంచ మార్కెట్లలో భారత-ఫ్రెంచ్ తయారీదారుల గుర్తింపు పెంచే ఉమ్మడి ఎగుమతులకు ప్రోత్సాహం, అమలుకు మార్గనిర్దేశం చేసే ఒక ఉమ్మడి సారథ్య కమిటీ ఏర్పడతాయి. ఈ సహకారం విస్తృతి మరింత సంస్థాగత సహకారం, ప్రధాన వస్త్ర కార్యక్రమాలలో పరస్పర భాగస్వామ్యం, ప్రపంచ ఉత్తమ పద్ధతుల ఆదానప్రదానం, సుస్థిర వనరుల సమీకరణకు ప్రోత్సాహం, భారత పరిశ్రమలకు-అంతర్జాతీయ ఫ్యాషన్ వ్యవస్థకు మధ్య బలమైన వ్యాపార సంబంధాలు నెలకొంటాయి. తద్వారా 'భారత్ టెక్స్' ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన వస్త్ర వేదికగా మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతుందని విశ్వసిస్తున్నారు.

ఈ భాగస్వామ్యంపై శ్రీ గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ- "భారత్ టెక్స్‌ను ప్రపంచ వేదికగా నిలపడంలో ఇది మరో ముఖ్యమైన మలుపు. కీలక ఐరోపా కొనుగోలుదారులతో భారత 'ఎంఎస్ఎంఈ'లతోపాటు తొలిసారి ఎగుమతిదారులు, తయారీదారుల సంధానానికి తోడ్పడుతుంది. దీంతోపాటు విశ్వసనీయ, వినూత్న, సుస్థిర సోర్సింగ్ గమ్యంగా భారత్ తన సామర్థ్యాన్ని చాటుతుంది. ప్రపంచ టెక్స్‌టైల్ విలువ శ్రేణిలో విశ్వసనీయ భాగస్వామిగా భారత్ పాత్ర ఇనుమడించేందుకూ దోహదం చేస్తుంది" అన్నారు.


మరో నాలుగు రోజుల్లో వాణిజ్యం, పెట్టుబడి, సుస్థిరత, ఇండస్ట్రీ 5.0, ఆవిష్కరణ, సాంకేతిక వస్త్రాలు, ఫ్యాషన్, విధానాలు-అంతర్జాతీయ సోర్సింగ్ అంశాలపై భారత్ టెక్స్-2026ను నిర్వహిస్తారు. ఇందులో 50కి పైగా విజ్ఞాన భాగస్వాములతో 100కు పైగా చర్చాగోష్ఠులను నిర్వహిస్తుంది. వీటిలో 39 బృంద చర్చలు, 16 రౌండ్‌టేబుళ్లు, 37 మాస్టర్‌క్లాసులు, 8 అధికారిక చర్చాగోష్ఠులు ఉంటాయి. వీటితోపాటు 4,000కు పైగా క్యూరేటెడ్ 'బి2బి' సమావేశాలను, 100కు పైగా 'బి2జి' సదస్సులను నిర్వహించేందుకు సిద్ధంగా ఉంది. అంతేగాక వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతికత, సుస్థిరత, మార్కెట్ సౌలభ్యం వంటి రంగాల్లో 30కి పైగా అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడానికీ తోడ్పడుతుంది. తద్వారా ప్రపంచ జౌళి విలువ వ్యవస్థ అంతటా చర్చలను వాణిజ్య రూపంలోకి తెస్తుంది.

ఈ కార్యక్రమంలో 'సిఐటీఐ సస్టైనబిలిటీ అవార్డ్స్-2026' ప్రదానోత్సవం కూడా నిర్వహిస్తారు. ఇది ఏడు ప్రధాన రంగాలలో బాధ్యతాయుత వాణిజ్య పద్ధతులను గుర్తిస్తుంది.. ఈ మేరకు వనరుల సామర్థ్యం, ఇంధనం-ఉద్గారాలు, వర్తుల ఆర్థిక వ్యవస్థ, సుస్థిర పదార్థాలు, సామాజిక బాధ్యత, బాధ్యతాయుత వ్యాపారం, పారిశ్రామిక సహకారం వంటివి ఇందులో భాగంగా ఉంటాయి.

నిరంతరాయ భాగస్వామ్య సౌలభ్యం దిశగా 'భారత్ టెక్స్-2026' తన మొబైల్ యాప్ సహా ప్రీ-ఫెయిర్ డైరెక్టరీని సమీకృత డిజిటల్ వ్యాపార వేదికలుగా వినియోగిస్తోంది. ఇవి ఎగ్జిబిటర్ డిస్కవరీ, మీటింగ్ షెడ్యూలింగ్, ఈవెంట్ నావిగేషన్, క్యూఆర్ ఆధారిత లీడ్ క్యాప్చర్, డిజిటల్ బ్యాడ్జ్ యాక్సెస్, ఏఐ-ఆధారిత మద్దతు, మరింత సమర్థ-డేటా ఆధారిత వ్యాపార అనుభవం కోసం ఆధునిక కొనుగోలుదారు-విక్రేతల జోడింపులో తోడ్పడతాయి.

అంతర్జాతీయంగా విశ్వసనీయ వస్త్ర తయారీ-సరఫరా కూడలిగా భారత్ రూపాంతరం చెందడాన్ని ప్రతిష్ఠాత్మక ప్రపంచ వస్త్ర రంగ కార్యక్రమమైన 'భారత్ టెక్స్-2026 స్పష్టం చేస్తోంది. ప్రభుత్వాలు, పరిశ్రమలు, ఆవిష్కర్తలు, పెట్టుబడిదారులు, కొనుగోలుదారులను ఇది ఒకే వేదికపైకి తెస్తుంది. తద్వారా వికసిత భారత్-2047 స్వప్న సాకారం దిశగా ప్రస్థానంలో భాగంగా పటిష్ట, సుస్థిర, భవిష్యత్ సంసిద్ధ వస్త్ర విలువ శ్రేణిని రూపొందించడంలో భారత్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

# లక్ష్యానికి దూరంగా అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం




ఒక్క అమాయకుడికి కూడా అన్యాయము జరగకూడదన్న సూత్రము న్యాయ వయ్వస్థకు పునాది. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం, అనేది "అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం" అని కూడా పిలువబడుతుంది. దీనిని ప్రపంచ వ్యాప్తంగా జూలై 17 న జరుపుకుంటారు.

యుద్ధ నేరాల ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నేతలపై విచారణ జరిపేందుకు ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొట్టమొదటిసారి 1919లో జరిగిన పారిస్ శాంతి సదస్సులో కమిషన్ ఆఫ్ రెస్పాన్సిబిలిటీస్ తెరపైకి తీసుకొచ్చింది. లీగ్ ఆఫ్ నేషన్స్ ఆధ్వర్యంలో నవంబరు 1-16, 1937 మధ్య జెనీవాలో జరిగిన సదస్సులో ఈ అంశాన్ని మరోసారి ప్రస్తావించారు.

రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా చోటుచేసుకున్న దురాగతాలపై విచారణ జరిపేందుకు ఒక శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని 1948లో మొదటిసారి ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో గుర్తించారు.

రెండో ప్రపంచ యుద్ధం తరువాత నాజీ యుద్ధ నేరాలపై దర్యాప్తు జరిపిన ఒక పరిశోధకుడు, న్యూరెంబర్గ్‌లో అమెరికా అధికారిక యంత్రాంగం జరిపిన పన్నెండు సైనిక విచారణల్లో ఒకటైన ఐన్‌శాట్జ్‌గ్రూపెన్ విచారణలో అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆర్మీ ప్రధాన న్యాయవాదిగా వ్యవహరించిన బెంజమిన్ బి. ఫెరెంజ్... ఒక అంతర్జాతీయ చట్ట పాలన, ఒక అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం ఏర్పాటుకు ప్రధాన మద్దతుదారుగా మారారు.

1975లో ప్రచురించిన 'డిఫైనింగ్ ఇంటర్నేషనల్ అగ్రెషన్ - ది సెర్చ్ ఫర్ వరల్డ్ పీస్' అనే తన మొదటి పుస్తకంలో, ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటు కోసం వాదించారు. అలా

ఒక శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానాన్ని సృష్టించాలని ప్రతిపాదన రావడంతో, 1989లో ఈ ఆలోచనకు రూప కల్పన చేసేందుకు, ముసాయిదాను తయారు చేసేందుకు నడుం బిగించ బడింది. యుగోస్లావియా, రువాండాల్లో యుద్ధ నేరాలపై విచారణ జరిపేందుకు న్యాయస్థానాలు తొలుత ఏర్పడ్డాయి. దీంతో ఒక శాశ్వత అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం ఏర్పాటు అవసరం మరింత ప్రాధాన్యత పొందింది. ఇందుకు సంబంధించి ఒక ఒప్పందాన్ని ఖరారు చేసే లక్ష్యంతో ఐక్య రాజ్య సమితి సాధారణ సభ జూన్ 1998లో రోమ్ నగరంలో ఒక సదస్సును ఏర్పాటు చేసింది. 21 దేశాలు ఈ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఒప్పందానికి చైనా, ఇరాక్, ఇజ్రాయెల్, లిబియా, ఖతర్, యునైటెడ్ స్టేట్స్, యెమెన్ ఏడు దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. జూలై 17, 1998న అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం రోమ్ శాసనం, 120 - 7 ఓట్ల తేడాతో ఆమోదించబడింది. ఇదే రోజున అంతర్జాతీయ న్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

ఏప్రిల్ 11, 2002న రోమ్ శాసనం సభ్య దేశాల ఆమోదంతో ఒక బంధన ఒప్పందంగా మారింది. శాసనం న్యాయబద్ధంగా జులై 1, 2002 నుంచి అమల్లోకి వచ్చింది. ఐసీసీ (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) కు ఆ రోజు తరువాత జరిగిన నేరాలపై మాత్రమే విచారణ జరిపే అధికారాన్ని కల్పించారు. 18 మంది న్యాయమూర్తులతో కూడిన మొదటి ధర్మాసనాన్ని సభ్యదేశాల సభలో ఫిబ్రవరి 2003లో ఎన్నుకోవడం జరిగింది. ఈ న్యాయమూర్తులు మార్చి 1, 2003న న్యాయస్థాన ప్రారంభ సెషన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు.

అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రెండూ వేరు వేరు సంస్థలు. వీటి రెండిటికీ పరిధి ఉంది. అంతర్జాతీయ న్యాయస్థానం లేదా ప్రపంచ న్యాయస్థానం ఐక్యరాజ్యసమితి ప్రాథమిక న్యాయ అంగంగా నెదర్లాండ్ లోని హేగ్ నగరంలోగల, శాంతి సౌధం లో యున్నది. దీని ప్రధాన కార్యక్రమం, సభ్యదేశాల ద్వారా సమర్పించబడిన "న్యాయపర వాదనలు" ఆలకించడం, తీర్పు చెప్పడం. అయితే దీని యొక్క విచారణలు ఎక్కడైనా జరగవచ్చు. ఆగస్టు 2010 నాటికి, 113 దేశాలు న్యాయస్థానంలో సభ్య దేశాలయ్యాయి, దాదాపుగా అన్ని ఐరోపా మరియు దక్షిణ అమెరికా దేశాలు, ఆఫ్రికాలోని సగం దేశాలు ఇప్పుడు దీనిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. మానవాళి చరిత్రలో మొట్టమొదటిసారి, ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి ఒక వ్యక్తికి నష్టపరిహారాన్ని మరో వ్యక్తి చెల్లించాలని ఆదేశించే అధికారాన్ని కల్పించారు. ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి ఇటువంటి అధికారం కల్పించడం కూడా ఇదే మొదటిసారి. కనీసం 139 దేశాల్లో అనుమానిత నేరాల గురించి న్యాయస్థానానికి ఫిర్యాదులు అందాయి.

న్యాయస్థానం ఐదు కేసులపై విచారణలు ప్రారంభించింది: ఉత్తర ఉగాండా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, డార్ఫూర్ (సూడాన్) మరియు రిపబ్లిక్ ఆఫ్ కెన్యా కేసులపై ఈ న్యాయస్థానం విచారణలు చేపట్టింది. న్యాయస్థానం పదహారు మంది వ్యక్తులను దోషులుగా నిర్ధారించింది. వీరిలో ఏడుగురు పరారీలో ఉండగా, ఇద్దరు మరణించారు (లేదా మరణించినట్లు విశ్వసిస్తున్నారు), నలుగురు నిర్బంధంలో ఉన్నారు. ముగ్గురు స్వచ్ఛందంగా న్యాయస్థానం ఎదుట లొంగి పోయారు. 2007 అక్టోబరు 4నాటికి కనీసం 139 దేశాల్లో అనుమానిత నేరాలకు సంబంధించి విచారణకర్తకు 2889 సమాచారాలు వచ్చాయి. అయితే ప్రాథమిక సమీక్ష తరువాత, ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులను న్యాయస్థానం యొక్క అధికార పరిధికి వెలుపల ఉన్న పరిస్థితులుగా గుర్తించి తోసిపుచ్చడం జరిగింది. ఐసిసికి 123 సభ్య దేశాల మద్దతు ఉందని చెపుతున్నా, ఐసిసి ఒక న్యాయ వ్యవస్థగా రోమ్ స్టాచ్యూట్‌కు కట్టుబడి, స్వతంత్రంగా, నిష్పాక్షికంగా పని చేస్తుందని ప్రకటిస్తున్నా, లక్ష్య సాధనకు బహుదూరంలో ఉంది. అమెరికా ఆంక్షల నీడలు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) మీద కూడా పడడం, సభ్య దేశాల సహకార లోపం తదితర కారణాలతో ఆశించిన ఫలితం రావడం లేదు.

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# జూలై 17న హర్యానా, చండీగఢ్, పంజాబ్‌లో పీఎం పర్యటన

న్యూఢిల్లీ, జులై 16:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జూలై 17న హర్యానా, చండీగఢ్, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటిస్తారు. ఉదయం సుమారు 11 గంటలకు జింద్ రైల్వేస్టేషన్‌లో జింద్-సోనిపట్ మధ్య నడిచే భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలును ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. ఉదయం 11:30 గంటలకు జింద్‌లోని ఏకలవ్య స్టేడియంలో దాదాపు రూ.14,700 కోట్ల విలువైన వలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తారు.

అనంతరం ప్రధానమంత్రి చండీగఢ్ వెళ్తారు. అక్కడ మధ్యాహ్నం సుమారు 1:45 గంటలకు రూ. 6,600 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

తదనంతరం ప్రధానమంత్రి జలంధర్‌ను సందర్శిస్తారు. అక్కడ రూ. 5,470 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.

హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలును ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. రైల్వే రంగంలో స్వచ్ఛమైన, స్థిరమైన రవాణా వ్యవస్థ దిశగా ఇది కీలక ముందడుగు. భారతదేశంలోనే రూపకల్పన, ఇంజనీరింగ్, ఏకీకృతం చేసిన ఈ రైలును దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అభివృద్ధి చేశారు. అత్యాధునిక రైల్వే ఇంజనీరింగ్‌లో పెరుగుతున్న దేశీయ సామర్థ్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. ఈ రైలు ప్రారంభంతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న ఎంపిక చేసిన కొన్ని దేశాల సరసన భారత్ చేరుతుంది.

హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సాంకేతికతతో ఈ రైలు నడుస్తుంది. ఇది హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మార్చి రైలు ముందుకు సాగేలా చేస్తుంది. ఈ ప్రక్రియలో ఉప-ఉత్పత్తిగా కేవలం నీటి ఆవిరి మాత్రమే విడుదలవుతుంది. దీని వల్ల రైలు నడిచే సమయంలో కర్బన ఉద్గారాలు వెలువడవు.

డీజిల్ రైళ్లతో పోలిస్తే పొగ గొట్టాల ద్వారా వచ్చే ఉద్గారాలను ఇవి పూర్తిగా నివారిస్తాయి. శిలాజ ఇంధనాలు, వాటి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. అలాగే చాలా తక్కువ శబ్దంతో నడుస్తాయి. సంప్రదాయ విద్యుత్ రైళ్లతో పోలిస్తే వీటికి నిరంతర ఓవర్‌హెడ్ విద్యుద్దీకరణ మౌలిక సదుపాయాలు అవసరం లేదు. ఇందులోని హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్ ద్వారా రైలులోనే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఇది వీటిని అత్యంత స్వచ్ఛమైన, సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా మారుస్తుంది. గ్రీన్ హైడ్రోజన్ వాడకం వల్ల శిలాజ ఇంధన ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే విద్యుత్‌పై ఆధారపడటం కూడా తగ్గుతుంది. ఇది సుస్థిర రవాణా వ్యవస్థ దిశగా భారత్ సాగించే ప్రయాణానికి దోహదపడుతుంది.

భారతదేశ హైడ్రోజన్ రైలును 10 కోచ్‌లతో రూపొందించారు. ఇప్పటి వరకు అభివృద్ధి చేసిన అత్యంత పొడవైన హైడ్రోజన్ ఆధారిత ప్రయాణీకుల రైళ్లలో ఒకటిగా ఇది నిలిచింది. ఇది 3,200 హెచ్‌పీ ప్రొపల్షన్ వ్యవస్థతో పనిచేస్తుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా గుర్తింపు పొందింది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ.. హర్యానాలో రూ. 12,470 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులను దేశానికి అంకితం చేయటంతో పాటు, శంకుస్థాపనలు చేస్తారు.

సుమారు రూ.9,680 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన 157.92 కిలోమీటర్ల పొడవైన, నాలుగు వరుసల, పూర్తి నియంత్రిత ప్రవేశం గల ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వే (ప్యాకేజీలు 1 నుంచి 5)ను ప్రధానమంత్రి జాతికి అంకితం ఇవ్వనున్నారు. 667 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వేలో ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ ఒక భాగం. ఈ ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా ఢిల్లీ, కత్రా మధ్య ప్రయాణ సమయం సుమారు 14 గంటల నుంచి దాదాపు 6 గంటలకు తగ్గుతుంది. ఢిల్లీ-అమృత్‌సర్ ప్రయాణ సమయం 8 గంటల నుంచి 4 గంటలకు తగ్గుతుంది. ఈ ప్రాజెక్టు ఎన్‌హెచ్-44 (జీటీ రోడ్)పై ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించటమే కాక, శ్రీ మాతా వైష్ణో దేవికి వెళ్లే యాత్రికులు, పర్యాటకుల సంఖ్యను పెంచుతుందని... ఈ కారిడార్ వెంట పారిశ్రామిక, లాజిస్టిక్స్ అభివృద్ధిని వేగవంతం చేస్తుందని భావిస్తున్నారు.

ఎన్‌హెచ్-7, ఎన్‌హెచ్-344 లపై ఉన్న 33.81 కిలోమీటర్ల పొడవైన, నాలుగు వరుసల, పాక్షికంగా నియంత్రిత ప్రవేశం గల అంబాలా-కాలా అంబ్ హైవేను కూడా ప్రధానమంత్రి జాతికి అంకితం చేస్తారు. ఈ హైవే అంబాలా పట్టణ ప్రాంతానికి, కాలా అంబ్ పారిశ్రామిక ప్రాంతానికి మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేస్తుంది. హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ మధ్య రహదారి మార్గాలను మెరుగుపరుస్తుంది. కొండ ప్రాంతాలకు పర్యాటకుల రాకపోకలను సులభతరం చేస్తుంది. కాలా అంబ్ ప్రాంతంలోని పరిశ్రమల రవాణా ఖర్చులను తగ్గిస్తుంది.

ఎన్‌హెచ్-352ఏపై నిర్మించిన 40.60 కిలోమీటర్ల పొడవైన జింద్-గోహానా గ్రీన్‌ఫీల్డ్ హైవే జాతికి అంకితం చేయనున్న మరో ప్రధాన ప్రాజెక్టు. ఈ కొత్త హైవే వల్ల జింద్, గోహానా మధ్య ప్రయాణ సమయం సుమారు రెండు గంటల నుంచి కేవలం 40 నిమిషాలకు తగ్గుతుంది. ఇది ప్రయాణికులకు, సరకు రవాణాకు, వ్యవసాయ పరంగా ఎంతో ప్రాధాన్యత గల జింద్-గోహానా ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. రోహ్‌తక్, పానిపట్, ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాలకు అనుసంధానాన్ని మరింత మెరుగుపరుస్తుంది.

దీనితో పాటు 24.27 కిలోమీటర్ల పొడవైన హన్సి-బర్వాలా బ్రౌన్‌ఫీల్డ్ హైవే ప్రాజెక్ట్‌కు కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతమున్న రహదారిని పేవ్డ్ షోల్డర్స్ గల 2,4-లైన్ల రహదారిగా ఆధునీకరిస్తారు.

కురుక్షేత్ర నగర పరిధిలోని రైల్వే క్రాసింగుల వద్ద ట్రాఫిక్ రద్దీని నివారించే ప్రధాన పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఎలివేటెడ్ రైల్వే ట్రాక్‌ను ప్రధానమంత్రి దేశానికి అంకితం చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా వాహనాల రాకపోకలు మరింత సులభతరం అవుతాయి. రహదారి భద్రత మెరుగవుతుంది. రైలు, రోడ్డు రవాణా వ్యవస్థల పనితీరు సామర్థ్యం పెరుగుతుంది.

ప్రధాన వైద్య సంస్థలను కూడా ప్రధానమంత్రి జాతికి అంకితం చేయనున్నారు. వాటిలో భివానీలోని పండిట్ నేకి రామ్ శర్మ ప్రభుత్వ వైద్య కళాశాల, నార్నౌల్‌లోని కొరియావాస్ వద్ద ఉన్న మహర్షి చ్యవన్ వైద్య కళాశాల, రావు తులా రామ్ ఆస్పత్రి ఉన్నాయి. ఈ సంస్థలు హర్యానాలో నాణ్యమైన వైద్య విద్యను మరింత అందుబాటులోకి తెస్తాయి. ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను పెంచుతాయి. ఆరోగ్య సంరక్షణ నిపుణుల లభ్యతను మెరుగుపరుస్తాయి. ఇళ్ల వద్దే ప్రజలు మెరుగైన వైద్య సేవలను పొందేలా చేస్తాయి. తద్వారా రాష్ట్ర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

ఈ ప్రాంత సాంస్కృతిక మౌలిక సదుపాయాలను మరింత సుసంపన్నం చేస్తూ.. కురుక్షేత్రలో సిక్కు మ్యూజియానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సిక్కు మత చరిత్ర, సిక్కు గురువుల బోధనలు, వారి ధైర్యసాహసాలు, త్యాగాలు, భారత నాగరికత, సంస్కృతులకు సిక్కు సమాజం అందించిన అమూల్యమైన సహకారాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శిస్తారు.

ఆరోగ్య సంరక్షణ, విద్య, రహదారి మౌలిక సదుపాయాల రంగాలకు సంబంధించి రూ. 6,600 కోట్లకు పైగా విలువైన పలు ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారు.

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్)లో అధునాతన మాతాశిశు కేంద్రాన్ని, న్యూరోసైన్సెస్ కేంద్రాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.

అధిక ముప్పుతో కూడిన గర్భధారణలు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న నవజాత శిశువులు, ప్రత్యేక చికిత్స అవసరమైన పిల్లల కోసం సమగ్ర తృతీయ శ్రేణి ఆరోగ్య సంరక్షణ సేవలను అందించేలా ఈ అధునాతన మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని రూపొందించారు. 300 పడకలు, అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఈ కేంద్రం, మాతాశిశు ఆరోగ్య సంరక్షణ సేవలను గణనీయంగా బలోపేతం చేయడమే కాకుండా ఈ ప్రాంతంలోని వేలాది కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది.

అడ్వాన్స్‌డ్ న్యూరోసైన్సెస్ సెంటర్... ఒకే చోట న్యూరాలజీ, న్యూరోసర్జరీ, న్యూరో-క్రిటికల్ కేర్ అత్యాధునిక రోగనిర్ధారణ సదుపాయాలతో కూడిన సమగ్ర సేవలను అందిస్తుంది. ఇది సంక్లిష్టమైన నరాల సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్న రోగులకు సకాలంలో ప్రపంచ స్థాయి చికిత్సను అందించడమే కాకుండా, న్యూరోసైన్సెస్‌లో వైద్య పరిశోధనలు, విద్య, శిక్షణను బలోపేతం చేస్తుంది.

చండీగఢ్ పీజీఐఎమ్ఈఆర్ లో ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం - ఏబీహెచ్ఐఎం) కింద 150 పడకల అత్యాధునిక క్రిటికల్ కేర్ బ్లాక్‌కు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఈ సదుపాయం అత్యవసర సంసిద్ధతను, తీవ్రమైన సంరక్షణ విస్తృత సేవలను, విపత్తు ప్రతిస్పందన సామర్థ్యాలను గణనీయంగా పెంచడమే కాకుండా, ఈ ప్రాంతంలోని మొత్తం ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుంది.

చండీగఢ్‌లోని విద్యా సంస్థలకు సంబంధించిన పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కూడా ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారు. వీటిలో పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీలో కురుక్షేత్ర బాయ్స్ హాస్టల్, మెస్, సెక్టార్ 46 లోని గవర్నమెంట్ కాలేజీలో హాస్టల్ బ్లాక్ ప్రారంభోత్సవాలు, పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీలో రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ శంకుస్థాపన ఉన్నాయి. ఈ సదుపాయాలు విద్యాపరమైన మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు, పరిశోధకులకు నివాస వసతులను మెరుగుపరుస్తాయి. ఉన్నత విద్యకు మెరుగైన వాతావరణాన్ని సృష్టిస్తాయి.

ఈ ప్రాంతంలో అనుసంధానాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా పలు ప్రధాన రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారు. మొహాలీ జిల్లాలోని ఐటీ సిటీ నుంచి కురాలీ వరకు నిర్మించిన 6-లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవేను ఆయన ప్రారంభిస్తారు, ఇది ఈ ప్రాంతానికి అత్యంత ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్. ఈ హైవే మొహాలీ, ఖరార్, కురాలీల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ మధ్య మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది.

ప్రధానమంత్రి 6-లేన్ల జిరాక్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ బైపాస్‌కు కూడా శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్ట్ జిరాక్‌పూర్-పంచకుల మార్గంలో ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు ప్రయాణికులకు మరింత సులభమైన, వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. అంబాలా-చండీగఢ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే (ఎన్హెచ్-205 ఏ) పీ ఆర్-7 స్పర్ కు కూడా శంకుస్థాపన చేస్తారు. 10.3 కిలోమీటర్ల పొడవైన ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ సుదూర ప్రాంతాల ట్రాఫిక్ జిరాక్‌పూర్ పట్టణ ప్రాంతాల మీదుగా వెళ్లకుండా నేరుగా జిరాక్‌పూర్ బైపాస్‌ను చండీగఢ్‌లోని ఏరోసిటీకి అనుసంధానించేందుకు వీలు కల్పిస్తుంది.

ఈ ప్రాంతంలో అనుసంధానాన్ని బలోపేతం చేయడం, ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడం, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసే లక్ష్యంతో కూడిన రూ. 5,470 కోట్ల పైగా విలువైన రైలు, రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారు.

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద, జలంధర్ కంటోన్మెంట్ తో సహా పునరాభివృద్ధి చేసిన 75 రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ప్రపంచంలోనే అతి

పెద్ద స్టేషన్ పునరాభివృద్ధి కార్యక్రమాలలో ఒకటైన అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 20 రాష్ట్రాల వ్యాప్తంగా 75 అమృత్ స్టేషన్ల ప్రారంభోత్సవం మరో ముఖ్యమైన ఘట్టాన్ని సూచిస్తుంది. సుమారు రూ. 1,570 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన ఈ స్టేషన్లు ఆధునిక, ప్రయాణికులకు అనుకూలమైన సదుపాయాలుగా మారాయి.

వారసత్వంతో పాటు అభివృద్ధి (విరాసత్ భీ, వికాస్ భీ) స్ఫూర్తితో పునరాభివృద్ధి చేసిన ఈ స్టేషన్లలో స్థానిక సంస్కృతి, వారసత్వం, వాస్తుశిల్పాన్ని ప్రతిబింబించే అంశాలను పొందుపరిచారు.

నంగల్ డ్యామ్-తల్వారా-ముకేరియన్ కొత్త రైలు మార్గం ప్రాజెక్టులో భాగంగా సుమారు రూ. 830 కోట్ల వ్యయంతో నిర్మించిన దౌలత్‌పూర్ చౌక్-కర్తోలి కొత్త రైలు మార్గాన్ని కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.

ఇది హోషియార్‌పూర్, ఉనా జిల్లాలకు ప్రయోజనం చేకూరుస్తూ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ మధ్య రైలు అనుసంధానాన్ని గణనీయంగా బలోపేతం చేస్తుంది.

# కోనరావుపేట అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది- విప్ ఆది శ్రీనివాస్

## త్వరలో బ్రిడ్జిల నిర్మాణానికి భూమిపూజ

వేములవాడ, జూలై 16: కోనరావుపేట మండల మార్కెట్ యార్డులో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. కోనరావుపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, బ్రిడ్జిల నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో గ్రామాల ప్రజల సమక్షంలో బ్రిడ్జిల నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, పదేళ్ల పాలనలో ఒక్క బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయలేదన్నారు. భూ సేకరణ చేయకుండానే శంకుస్థాపనలు చేసి పనులను వదిలేశారని ఆరోపించారు. కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు, కుడి?ఎడమ కాలువల పనుల్లో రైతులకు నష్టపరిహారం చెల్లించలేదని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం ఆ బకాయిలను చెల్లించిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కుంభకోణంపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించిన ఆయన, ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. గతంలో ఈ ప్రాంతాన్ని పట్టించుకోని వారు ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు.

# ప్రభుత్వ పథకాలను సకాలంలో పూర్తి చేయాలి-కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



కామారెడ్డి, 16:(నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ పథకాలను లక్ష్యాలకు అనుగుణంగా సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సమగ్ర ఇంటింటి సర్వే గ్రామీణ, మండలాల్లో ఆశించిన మేరకు కొనసాగుతున్నదని అన్నారు. కామారెడ్డిలో సర్వేను వేగవంతం చేసి ఎన్యూమరేషన్ ఫారాలను త్వలో డిజటలైజేషన్ చేయాలని అధికారులకు సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి- కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, జులై 16:(నేటినిజం ప్రతినిధి): యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



అధికారులను ఆదేశించారు. గురువారం హౌసింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. నిజమైన అర్హులకే ఇండ్లు మంజూరు చేయాలని, క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ నిర్మాణాల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. దశల వారీగా నిర్మాణాలు పూర్తిచేసి త్వరగా గృహప్రవేశాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అదేవిధంగా వన మహోత్సవం సందర్భంగా జిల్లాలో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేందుకు ముందస్తుగా గుంతలు తవ్వించి, మొక్కలు సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.

# గూడ్స్ వాహనాల్లో కూలీల తరలింపుపై రవాణా శాఖ కొరడా

**- బోయినిపల్లిలో- వాహనం సీజ్**



వేములవాడ, జులై 16: వరి నాట్ల సీజన్ నేపథ్యంలో గూడ్స్ వాహనాల్లో వ్యవసాయ కూలీలను తరలిస్తున్న వారిపై రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లె వద్ద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వంశీధర్ తనిఖీలు నిర్వహించి, కూలీలను తరలిస్తున్న ఓ గూడ్స్ వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం వరి నాట్లు వేస్తున్న కూలీలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రయాణికులను గూడ్స్ వాహనాల్లో తరలించడం చట్టవిరుద్ధమని, ప్రాణాపాయానికి దారితీస్తుందని పేర్కొంటూ, కూలీలు తప్పనిసరిగా ప్యాసింజర్ వాహనాల్లోనే ప్రయాణించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వాహన యజమానులు, డ్రైవర్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని రవాణా శాఖ హెచ్చరించింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana. 'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.